

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 27-04-2026 | సంపుటి - 27 | సంచిక -335 | రూ : 4 | పేజీలు: 8


# స్వీయ జనగణన షురూ

- అందరూ పాల్గొనాలని రాష్ట్ర ప్రజలకు గవర్నర్, సీఎం పిలుపు
- కుటుంబ వివరాలు నమోదు చేసిన శివప్రతాప్ శుక్లా, రేవంత్‌రెడ్డి
- వివరాలు ఇస్తే పథకాలు రావనే అపోహ వద్దన్న కిషన్‌రెడ్డి

2లో



పెట్రోల్, డీజిల్ ఫుల్‌స్టాక్..

## బంకుల్లో 'నో స్టాక్'!

- డబ్బు కట్టినా సరఫరా చేయట్లేదంటున్న డీలర్లు
- ప్రభావం చూపిస్తున్న రూపాయి విలువ, ఆయిల్ కంపెనీల నష్టాలు
- ఎన్నికలయ్యాక ధరలు పెరుగుతాయన్న ఆందోళనలు

2లో



యుద్ధం పేరిట

## గ్యాస్ దందా..



2లో

- ఏజెన్సీలే బ్లాక్ మార్కెట్ చేస్తున్న వైనం బుకింగ్ ఆలస్యం పేరిట అధిక ధరకు అమ్మకం
- డొమెస్టిక్ సిలిండర్ల నుంచి కమర్షియల్ సిలిండర్లకు రీఫిల్లింగ్..నామ్‌కే వాస్తేగా విజిలెన్స్



మార్కెట్‌పై కొనసాగుతున్న.

## యుద్ధ మేఘాలు

- సెంటిమెంటు ప్రతికూలంగానే
- చమురు ధరలు, ఆర్థిక ఫలితాలు కీలకం
- విశ్లేషకుల అంచనాలు
- మే 1న మార్కెట్లకు సెలవు
- స్టాక్ మార్కెట్ ఈ వారం


దేశీయ మార్కెట్లపై ఇరాన్ యుద్ధ మేఘాలింకా తొలగలేదు. అక్కడి ఉద్రిక్తతల వల్ల ముడి చమురు బ్యారెల్ ధర మళ్లీ 100 డాలర్లపైకి చేరడంతో ఇక్కడి మార్కెట్లలో ప్రతికూల సెంటిమెంటు కొనసాగొచ్చని విశ్లేషకులు అంటున్నారు. పెట్రోలు, డీజిల్ రేట్లను

తరువాయి 2లో

## ట్రంప్ విందులో పేలిన తుపాకీ

- శ్వేత సౌధ విలేకరుల డిన్నర్ జరుగుతున్న హోటల్‌లోకి దూసుకొచ్చిన దుండగుడు
- భద్రతా సిబ్బందిపైకి కాల్పులు
- వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ ఏజెంట్లు
- విందు జరుగుతున్న బాల్‌రూంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో తప్పిన ముప్పు
- సురక్షితంగా బయటపడ్డ అధ్యక్ష, ఉపాధ్యక్షులు
- ఘటనాస్థలిలోనే అదుపులోకి నిందితుడు
- రెండేళ్లలో ఇలాంటిది మూడోసారి
- దాడి యత్నాన్ని ఖండించిన మోదీ, ప్రపంచ దేశాల నేతలు

2లో



పెంచలకోన బ్రహ్మోత్సవాలు..

## సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

- పెంచలకోన బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం
- సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక అందించిన ఎమ్మెల్యే కురుగొండ్ల
- ఈనెల 27 నుంచి మే 3 వరకు జరగనున్న ఉత్సవాలు
- ముఖ్యమంత్రికి స్వామివారి ప్రసాదాన్ని, ఆశీర్వచనం అందించిన అర్చకులు
- ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో





ట్రంప్‌పై కాల్పులు

## ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కార్యక్రమం వద్ద కాల్పుల కలకలం
- క్షేమంగా బయటపడిన ట్రంప్.. ఆయన కుటుంబ సభ్యులు
- ఘటనను తీవ్రంగా ఖండించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదంటూ మోదీ వ్యాఖ్య

2లో

ఢిల్లీ విమానాశ్రయంలో ప్రమాదం

## టేకాఫ్ రద్దు, ఆరుగురికి గాయాలు

- ఇంజిన్‌లో సాంకేతిక లోపంతో అప్రమత్తమైన పైలట్లు
- ఎమర్జెన్సీ స్లైడ్ల ద్వారా ప్రయాణికుల తరలింపు
- ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తుకు ఆదేశించిన ఎయిర్‌లైన్స్

2లో



# స్వీయ జనగణన షురూ

హైదరాబాద్ : అమెరికా ప్రోద్బలంతో ఎక్కడోనున్న ఇజ్రాయిల్... ఇరాన్‌పై యుద్ధం చేస్తే మనకేంటి అనుకునే వారి జేబులకు ఇప్పుడు చిల్లులు పడుతున్నాయి. ఆ ప్రభావం ఢిల్లీని దాటి హైదరాబాద్ గల్లీలపై పడుతోంది. ముఖ్యంగా ఇది 'వంటిట్లో కుంపట్లు' పెడుతోంది. కప్పు ఛారు తాగుదామన్నా.. ప్లేటు ఇడ్లీ తిందామన్నా.. ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. యుద్ధం పేరు చెప్పి గృహ (డొమెస్టిక్), వాణిజ్య (కమర్షియల్) సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టించటం, వినియోగదారుల అవసరాలను ఆసరా చేసుకుని వాటి ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచి దందా నడుపుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ దందా నడుస్తున్నా...పౌర సరఫరాలశాల విజిలెన్స్ విభాగం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం. విభాగపు అధికారులు... ఐదారు వేల అక్రమ సిలిండర్లను సీజ్ చేశాం, దందా రాయుళ్లపై కేసులు నమోదు చేశామంటూ చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రాష్ట్రంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్ల యాజమానులు మాత్రం ఇప్పటికీ సిలిండర్లను బ్లాక్‌లోనే కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇంతకు ముందు డెలీవరి బారులు తమ దగ్గరికి వచ్చి సిలిండర్లను దించిపోయేవారని, కానీ ఇప్పుడు బ్లాక్‌లో అధిక మొత్తంలో 'సమర్పిస్తేనే' డెలివరీ చేయిస్తామంటూ ఏజేన్సీలే బెదిరిస్తున్నాయని పలు టిఫిన్ సెంటర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమర్షియల్ సిలిండర్ ధర ఇప్పుడు అసలు ధర కంటే రెండింతలు పెరిగిపోయిందని, ఇది తమకు భరించలేని భారంగా మారిందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

*** కమర్షియల్ రూ.5 వేలు.. డొమెస్టిక్ రూ.3,500**

ఈ దందా వల్ల రూ.2,105 ఉన్న కమర్షియల్ సిలిండర్‌ను బ్లాక్‌లో ఏకంగా రూ.5 వేలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. రూ.950గా ఉన్న డొమిస్టిక్ సిలిండర్ ధరను దళారులు రూ.2 వేల నుంచి రూ.3,500 పెంచి అమ్ముకుంటున్నారు. దీంతో వినియోగదారులపై తీవ్ర భారాలు పడుతున్నాయి. అయినా అదికారుల్లో మాత్రం చలనం లేదు. డిస్ట్రిబ్యూటర్లు, సిబ్బంది, దళారులు, అధికార యంత్రాంగం కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా ఈ దందాను నడుపుతున్నారని సమాచారం. అధికారుల అండదండలు బలంగా ఉండటం వల్లే దళారులు రెచ్చిపోతున్నారని తెలిసింది. మరోవైపు కమర్షియల్ సిలిండర్ కావాల్సిన వినియోగదారులు...డిస్ట్రిబ్యూటర్‌కు లేదంటే ఏజెన్సీకి ఫోన్ చేస్తే సరఫరా చేస్తారు. డొమెస్టిట్ సిలిండర్‌ను మాత్రం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. కానీ ఇప్పుడు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో లేదా ఫోన్‌లో ఎలా బుక్ చేసినా ధరాభారం మాత్రం తప్పటం లేదు.

*** రీఫిల్లింగ్ దందా...**

గ్యాస్ సిలిండర్ ధరలను భరించలేక హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని కొన్ని వందల హోటళ్లు, టిఫిన్ సెంటర్స్, రెస్టారెంట్లను నెలక్రితమే మూసేశారు. అందులో ఇప్పటికీ చాలా వాటిని తెరవలేదు. యుద్ధ తీవ్రత తగ్గి.. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకుంటున్నప్పటికీ గ్యాస్ దందా మాత్రం అలాగే కొనసాగుతోంది. గ్యాస్ అక్రమ నిల్వలను ఆరికట్టాల్సిన అధికార యంత్రాంగం దళారులకే వత్తాసు పలుకుతోంది. దీనికితోడు డొమెస్టిక్ సిలిండర్ల నుంచి గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్లకు రీఫిల్లింగ్ చేసి, ఆ మేరకు ధర పెంచి దండుకుంటున్న ఘటనలు అనేకం వెలుగు చూశాయి. ఇదే సమయంలో బుకింగ్ కావడం లేదంటూ ప్రచారం చేయటం, బుకింగ్ అయినప్పటికీ స్టాక్ లేదని చెప్పడం, కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు అమ్ముకోవటం తదితర పద్ధతుల్లో వినియోగదారుల నుంచి దందారాయుళ్లు భారీగా దండుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పౌర సరఫరాలశాఖ దీనికి అడ్డుకట్ట వేస్తుందా? లేదా? అనేది చూడాలి.

## మార్కెట్‌పై కొనసాగుతున్న యుద్ధ మేఘాలు

దేశీయ మార్కెట్లపై ఇరాన్ యుద్ధ మేఘాలింకా తొలగలేదు. అక్కడి ఉద్రిక్తతల వల్ల ముడి చమురు బ్యారెల్ ధర మళ్లీ 100 డాలర్లపైకి చేరడంతో ఇక్కడి మార్కెట్లలో ప్రతికూల సెంటిమెంటు కొనసాగొచ్చని విశ్లేషకులు అంటున్నారు. పెట్రోలు, డీజిల్ రేట్లను లీటరుకు రూ.20 పైగా ప్రభుత్వం పెంచకపోవచ్చని, అలా చేస్తే భారత ఆర్థిక వ్యవస్థపై ద్రవ్యోల్బణ ప్రభావం భారీగా పడే అవకాశం ఉందని ఓ బ్రోకరేజీ ప్రతినిధి అంటున్నారు. క్రమంగా పెంచుకుంటూ వెళ్లాలని అది కూడా లీటరుకు రూ.56 కంటే ఎక్కువగా ఉండరాదని అభిప్రాయపడ్డారు. నిఫ్టీ 50కి 24,200 వద్ద నిరోధం, 23,630 వద్ద మద్దతు కనిపించొచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. జేపీ మోర్గాన్ భారత ఈక్విటీల రేటింగ్‌ను తగ్గించడం గమనార్హం. మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1న(శుక్రవారం) మార్కెట్లకు సెలవు కావడంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానుంది. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలిలా..

ఐటీ కంపెనీల షేర్లు ఒత్తిడిలో కొనసాగొచ్చని అంచనా. దేశీయ కంపెనీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాల విషయంలో అప్రమత్తత పాటించడం ఇందుకు నేపథ్యం. రూపాయి మరింత క్షీణిస్తే ఐటీ షేర్లలో అపుడపుడు కాస్త ఉత్సాహం కనిపించొచ్చు. బుధవారం ఎంఫసిస్, గురువారం న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ఫలితాలున్నాయి.

ఇటీవలి ధరల పెంపు నేపథ్యంలో సిమెంటు షేర్లు ఒత్తిడిలో కొనసాగొచ్చు. సోమవారం వెలువడే అల్ట్రాటెక్ సిమెంట్ ఫలితాలపై దృష్టి పడొచ్చు. పెట్రోలియం కోక్ ధరల వల్ల వ్యయాలు అధికంగానే ఉండొచ్చు. అసెంబ్లీ ఎన్నికలు, కార్మికుల కొరత, పెళ్లిళ్ల సీజను, దేశంలో చాలా ప్రాంతాల్లో వడగాల్పులు తదితరాల వల్ల గిరాకీ స్తబ్ధుగా ఉండొచ్చు.

ఫార్మా కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించవచ్చు. బలహీన మార్కెట్లో రక్షణాత్మక రంగంగా ఇది పనిచేయవచ్చు. భారత్‌కు చెందిన కంపెనీల దేశీయ విక్రయాలు బాగున్నా, కరెన్సీ బలహీనతల వల్ల ముడిపదార్థాల వ్యయాలు పెరగవచ్చు.

నిఫ్టీ చమురుగ్యాస్ సూచీ ప్రతికూలంగా కదలాడవచ్చు. పెరుగుతున్న చమురు ధరలు మదుపర్ల సెంటిమెంటును దెబ్బతీస్తున్నాయి. చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల ఎగువన ఉన్నంతకాలం సెంటిమెంటు ఒత్తిడిలో ఉండొచ్చు.

లోహ కంపెనీ షేర్లు మార్కెట్‌తో పాటే కదలాడవచ్చు. మే 1న జిందాల్ స్టీల్ ఫలితాలు విడుదల కానున్నాయి. అదే తేదీ నుంచి వేదాంతా విభజన అమల్లోకి రావడంపైనా మదుపర్లు దృష్టి సారించొచ్చు. అయితే ఆ రోజు మార్కెట్లకు సెలవు కావడంతో తదుపరి వారం ఆ ప్రభావం పడొచ్చు.

మార్కెట్‌తో పాటే వాహన కంపెనీలు ప్రతికూల ధోరణిలో కదలాడవచ్చు. జీఎస్‌టీ కోత వల్ల వచ్చిన గిరాకీని కాస్తా పెరుగుతున్న ముడి చమురు ధరల వల్ల పెట్రో ధరలు పెరుగుతాయన్న భయాలు తగ్గించే అవకాశం ఉందన్న అంచనాలున్నాయి.

ఢిల్లీ విమానాశ్రయంలో ప్రమాదం

## టేకాఫ్ రద్దు, ఆరుగురికి గాయాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 : ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఢిల్లీ నుంచి జ్యూరిచ్ వెళ్లాల్సిన స్విస్ ఎయిర్‌లైన్స్ విమానం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో టేకాఫ్ రద్దు చేసుకుంది. ఈ క్రమంలో విమానాన్ని అత్యవసరంగా ఖాళీ చేయిస్తుండగా ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఆదివారం తెల్లవారుజామున 1:08 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. LX147 విమానం రన్‌వేపై టేకాఫ్ కోసం వేగంగా వెళ్తుండగా ఇంజిన్‌లో సమస్యను సిబ్బంది గుర్తించారు. దీంతో వెంటనే టేకాఫ్‌ను నిలిపివేసి, ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని ఖాళీ చేయాలని నిర్ణయించారు. విమానంలో 232 మంది ప్రయాణికులు, నలుగురు చిన్నారులతో పాటు సిబ్బంది ఉన్నారు. ప్రయాణికులను ఎమర్జెన్సీ స్లైడ్ల ద్వారా కిందకు దించారు. ఈ తరలింపు ప్రక్రియలో ఆరుగురు ప్రయాణికులు గాయపడగా, వారిని చికిత్స కోసం మేదాంత ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్విస్ ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఘటనకు గల కారణాలను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఒక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. విమానాన్ని పరిశీలించేందుకు ఢిల్లీకి తమ సాంకేతిక నిపుణుల బృందాన్ని పంపుతున్నామని ఎయిర్‌లైన్ పేర్కొంది. ప్రయాణికులందరికీ ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు, హోటల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించింది.

## ట్రంప్ పై కాల్పులు.. ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి

వాషింగ్టన్/న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన ఒక కార్యక్రమం వద్ద కాల్పుల ఘటన చోటుచేసుకోవడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ఘటనను ఖండిస్తూ, ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదని స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులు క్షేమంగా ఉన్నారన్న వార్త తనకు ఉపశమనం కలిగించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వాషింగ్టన్ డీసీలోని హిల్టన్ హోటల్‌లో శనివారం రాత్రి వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ వార్షిక విందు జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు ట్రంప్, ప్రథమ మహిళ మెలానియా ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇతర కీలక ఉన్నతాధికారులు హాజరయ్యారు. అదే సమయంలో హోటల్ వద్ద తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించడంతో తీవ్ర కలకలం రేగింది. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ట్రంప్ దంపతులతో పాటు ఉన్నతాధికారులను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం విందును రద్దు చేశారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "అధ్యక్షుడు ట్రంప్, ప్రథమ మహిళ, ఉపాధ్యక్షుడు క్షేమంగా, ఎలాంటి హాని జరగకుండా బయటపడ్డారని తెలిసి ఊరట చెందాను. వారి భద్రత, శ్రేయస్సు కోసం నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదు. దానిని నిస్సందేహంగా ఖండించాలి" అని పోస్ట్ చేశారు. అటు ఈ ఘటనపై వైట్ హౌస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. పలు ఆయుధాలు ధరించిన ఓ వ్యక్తి సెక్యూరిటీ చెక్‌పాయింట్ వైపు దూసుకొచ్చాడని తెలిపారు. సీక్రెట్ సర్వీస్ సభ్యులు అతడిని అడ్డుకున్నారని చెప్పారు. ఆ దుండగుడు ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌పై కాల్పులు జరిపాడని, అయితే బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించడం వల్ల అతను సురక్షితంగా ఉన్నాడని వివరించారు. ఆ ఏజెంట్ ప్రస్తుతం మంచి ఆరోగ్యంతో ఉన్నారని ట్రంప్ పేర్కొన్నారు. దాదాపు 50 గజాల దూరం నుంచి ఆ వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చాడని ట్రంప్ తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ ఫుల్‌స్టాక్.. బంకుల్లో 'నో స్టాక్'!

హైదరాబాద్: 'రాష్ట్రంలో ఇంధనం కొరత లేదు.. నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి' అంటోంది పౌరసరఫరాలశాఖ. పలుచోట్ల పెట్రోల్ బంకుల్లో మాత్రం 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల వాహనదారులు బారులు తీరుతున్నారు. కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో అయితే పోలీసు భద్రత మధ్య విక్రయాలు చేపట్టాల్సిన స్థితి నెలకొంది. మొత్తంగా చూస్తే.. ఇంధనం కొరత తీవ్రంగానే ఉంది. అందులోనూ డీజిల్ సమస్య అధికం. శుక్రవారం నుంచి ఈ సమస్య పెరుగుతున్నట్టే కనిపిస్తోంది. మరోవైపు ఆయిల్ కంపెనీల నుంచి ఇంధనం సకాలంలో సరఫరా కావడం లేదని పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఓటింగ్ పూర్తయ్యాక పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఖాయమన్న భయం సమస్యను తీవ్రం చేస్తోంది. రాష్ట్రంలో 4 వేలకు పైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. గతంలో ముందు పెట్రోల్, డీజిల్ సరఫరా చేసి.. సాయంత్రం లేదా మర్నాడు డబ్బులు తీసుకునే వెసులుబాటును ఆయిల్ కంపెనీలు ఇచ్చేవి. ఇరాన్‌అమెరికా యుద్ధంతో పరిస్థితి మారింది. డబ్బులు కడితేనే ఆయిల్ ట్యాంకర్లను పంపించే విధానం మొదలైంది. ఇప్పుడయితే డబ్బులు కట్టి ఇండెంట్ పెట్టినా రెండు, మూడు రోజులకు గానీ ట్యాంకర్లు రావడం లేదని డీలర్లు చెబుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25% బంకులు తాత్కాలికంగా మూతపడ్డట్లు తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. గతంలో అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ధరలు మార్చుకునే డైనమిక్ విధానం ఉండేది. ఫలితంగా రోజువారీగా ధరలు మారేవి. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పుడు స్థిరంగానే ఉంటున్నాయి. అయితే పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఆయిల్ కంపెనీలు నష్టాలు చవిచూస్తున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గిపోవడం, దాడుల నేపథ్యంలో నౌకల బీమా ప్రీమియం పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు ఆకాశాన్నంటడం.. తదితర కారణాలతో నష్టాలు పెరుగుతున్నాయని ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. వీటిని తగ్గించుకునేందుకు సరఫరా కూడా తగ్గిస్తున్నాయని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. 'డబ్బులు కట్టినా మూడురోజుల వరకు ఇంధనం పంపించకపోతే బంకును మూసివేయాల్సి వస్తోంది. వారానికి రెండ్రోజుల చొప్పున నెలకు ఎనిమిది రోజులు మూసివేస్తే.. నిర్వహణ ఖర్చులు మాత్రం తగ్గవు కదా?' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ట్రంప్ విందులో పేలిన తుపాకీ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం జరిగింది. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో ఆయన, సతీమణి మెలనియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తుపాకులు, కత్తులతో వచ్చిన ఆగంతుకుడు 'శ్వేతసౌధం విలేకరుల సంఘం' విందు జరుగుతున్న హోటల్‌లోని బాల్‌రూంవైపు వెళ్తూ కాల్పులకు దిగడంతో ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది. ట్రంప్‌ను రక్షించడానికి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఆగమేఘాలపై స్పందించగా.. కాల్పుల చప్పుళ్లు వినగానే ప్రాణభయంతో పలువురు అతిథులు టేబుళ్ల కింద దాక్కోవాల్సి వచ్చింది. నిందితుడు కోల్ టొమాస్ అలెన్‌ను (31) అక్కడికక్కడే నిర్బంధంలోకి తీసుకుని సంకెళ్లు వేశారు. అతడి వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఘటన తర్వాత కూడా విందు కొనసాగించాలని ట్రంప్ గట్టిగా భావించినా.. భద్రతాధికారులు ఆ ప్రాంగణాన్ని తక్షణం ఖాళీ చేయడమే మేలని సూచించి ఆయనను శ్వేతసౌధానికి తరలించారు. ట్రంప్‌పై దాడికి ప్రయత్నించడం రెండేళ్లలో ఇది మూడోసారి.

**ఏం జరిగిందంటే..**

వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్' (డబ్ల్యూహెచ్‌సీఏ) ఏడాదికి ఒకసారి విందు సమావేశాన్ని నిర్వహిస్తుంటుంది. శ్వేతసౌధానికి సంబంధించిన వార్తలు రాసే పాత్రికేయులు తమ వృత్తి గౌరవార్థం ఇచ్చే ఈ విందుకు అధ్యక్షుడు హాజరై మాట్లాడటం పరిపాటి. అందులో భాగంగా శ్వేతసౌధానికి మైలు దూరంలోని 'వాషింగ్టన్ హిల్టన్' హోటల్లో శనివారం రాత్రి విందు జరుగుతున్నప్పుడు 8.34 గంటల సమయంలో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. హాల్ బయట కలకలాన్ని గుర్తించి ట్రంప్ దంపతుల చుట్టూ భద్రతాధికారులు వలయంగా ఏర్పడి వేదిక వద్ద నుంచి తరలించారు. వేదిక నుంచి ట్రంప్ దిగుతూ కొంత తడబడగా సిబ్బంది చేయూతనిచ్చారు. ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, ఉష దంపతులనూ సిబ్బంది బయటకు తీసుకెళ్లారు.

**నిందితుడి బస అదే హోటల్లో..**

కాలిఫోర్నియాలోని టొరాన్స్‌కు చెందిన నిందితుడు అలెన్ అదే హోటల్లో బస చేశాడని అధికారులు గుర్తించారు. అతడు మెకానికల్ ఇంజినీరింగ్ చేసి, ఆ తర్వాత కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసిన ప్రోగ్రామర్. కొత్తకొత్త సాంకేతికతలు కనిపెట్టేవాడు. గతంలో డెమోక్రటిక్ పార్టీకి కొద్దిపాటి విరాళం ఇచ్చాడు.

## పెంచలకోన బ్రహ్మోత్సవాలు.. సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

అమరావతి, ఏప్రిల్ 26 : ముఖ్యమంత్రి చంద్రబాబును నెల్లూరు జిల్లా పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ పాలకమండలి ఛైర్మన్ తిరుపాల్ రెడ్డి సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా, ఈ నెల 27 నుంచి మే 3వ తేదీ వరకు వైభవంగా జరగనున్న పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు తప్పనిసరిగా రావాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. వారి వెంట వచ్చిన ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు చిత్రపటాన్ని బహూకరించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యేను, ఆలయ ఛైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## మమత సభకు బీజేపీ ఆటంకం.. ప్రసంగం మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయిన సీఎం

పశ్చిమ బెంగాల్‌లోని భబానీపూర్‌లో శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యకర్తల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి వేదిక దిగివెళ్లడంతో ఈ గొడవలు ప్రారంభమయ్యాయి. భబానీపూర్‌లో టీఎంసీ, బీజేపీ సభలను కేవలం 100 మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేశారు. మమతా బెనర్జీ ప్రసంగిస్తుండగా, సమీపంలోని బీజేపీ సభ నుంచి లౌడ్ స్పీకర్ల ద్వారా శబ్దాలు చేస్తూ తన సభకు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ ఘటన అవమానకరంగా ఉందని పేర్కొంటూ ప్రజలకు క్షమాపణలు చెప్పి ప్రసంగాన్ని ముగించకుండానే వేదిక నుంచి నిష్క్రమించారు. ముఖ్యమంత్రి వెళ్లిపోయిన వెంటనే ఆగ్రహానికి గురైన టీఎంసీ కార్యకర్తలు నిరసనగా బీజేపీ సభా ప్రాంగణం వైపు దూసుకెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య నినాదాల పర్వం మొదలై, అది కాస్తా ఘర్షణకు దారితీసింది. భద్రతా దళాలు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. ఈ గందరగోళానికి మమతా బెనర్జీనే కారణమని సువేందు అధికారి ఆరోపించారు. కాగా, 2011 నుంచి మమతకు కంచుకోటగా ఉన్న భబానీపూర్ నియోజకవర్గంలో ఈ నెల 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

*** ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులకు ప్రాధాన్యం**

*** నేటి నుంచి మంత్రి పొంగులేటి ఉమ్మడి జిల్లాల ప్రత్యేక సమీక్షలు**

## క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారమే లక్ష్యం

హైదరాబాద్: ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకమైన ఇందిరమ్మ గృహ నిర్మాణాలతోపాటు 'భూ భారతి' అమలుపై క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో తెలుసుకుని పరిష్కరించేందుకు రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక సమీక్షలకు శ్రీకారం చుట్టారు. సోమవారం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలు.. మధ్యాహ్నం తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల సమీక్షలు చేపట్టనున్నారు. జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు హాజరుకానున్నారు. వారం చివరిలోపు మరో రెండు ఉమ్మడి జిల్లాల సమీక్షలు చేపట్టనున్నారు.

**సమస్య - పరిష్కారం**

ఇటీవలి శాసనసభ సమావేశాల్లో పలువురు సభ్యులు ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ శాఖకు చెందిన సమస్యలను ప్రస్తావించారు. ఆ సమయంలోనే జవాబు ఇచ్చిన మంత్రి పొంగులేటి.. సమావేశాల అనంతరం హైదరాబాద్‌లో ప్రత్యేక భేటీ ఏర్పాటు చేసి పరిష్కారాలు కనుగొందామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే మంత్రి జిల్లాల సమీక్షలు ప్రారంభించినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులు.. వారు ఇచ్చే సూచనలకు ఈ సమీక్షల్లో పెద్దపీట వేసే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. అంతిమంగా ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి భావిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రెండు పడకల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఆగిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 35,200 వరకు కేటాయించాల్సిన ఇళ్లు ఉన్నాయి. అసంపూర్తిగా వదిలేసిన వాటిని పూర్తిచేస్తున్నారు. అర్హులను గుర్తించి వీటి కేటాయింపు ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. ఎవరికీ కేటాయించని ఇళ్లను ఇందిరమ్మ మొదటి విడతలో ఎదురుచూస్తున్న ఎల్ 2 జాబితాలోని పేదలకు ఇవ్వాలన్న ఆలోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ పథకంలో నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందేలా చూడాలన్న లక్ష్యంపైనా సమీక్షల్లో చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మినహాయించి 3.25 లక్షల ఇళ్లకు అనుమతులు ఇచ్చారు. వీటిలో 2.66 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది.

# తిమ్మాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, జన్నారం : జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసిఉల్లాహ్ ఆదివారం ప్రారంభించారు.రైతులు పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రంలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముజఫర్ అలీ,మేకల మాణిక్యం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజన్న యాదవ్, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, పీఏసీఎస్ అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో.. వాసవి మాత జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, జన్నారం : ఆర్యవైశ్యుల కుల దైవమైన శ్రీ వాసవిమాత కు జన్నారం మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రోజున మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ సహిత మహాలక్ష్మి దేవాలయంలో వాసవిమాత జయంతిని పురస్కరించుకొని పురోహితులు గుండి గణేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్,ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు జక్కు భూమేష్, సెక్రెటరీ గోపాలకృష్ణ,వర్తక సంఘం అధ్యక్షుడు వోజ్జల వామన్ కుమార్,ప్రధాన కార్యదర్శి జక్కు రమేష్‌కోశాధికారి కొమరవెల్లి శివరామకృష్ణ,మహాలక్ష్మి ఆలయ కమిటీ అధ్యక్షుడు జక్కు సత్తయ్య,నాయకులు గుండ లచ్చన్న, గుండ సుధాకర్,కొమురవెల్లి లచ్చన్న, పద్మ నారాయణ గోలిచందు,అక్కెనపల్లి శ్రీను,నాగేష్, శ్రీహరి, వెంకటేష్, పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. వాసవి జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించేదుకు ప్రభుత్వ నిర్ణయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

# జనగణన 2027 ను పారదర్శకంగా సమగ్రంగానిర్వహించాలి

* **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : బీబీనగర్ లోని ఎంపీడీవో కార్యాలయంలో సూపర్వైజర్స్ ఎన్యుమరేటర్లకు ఆదివారం జనగణన 2027 ఫేజ్-2 శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన శిక్షణ తరగతులు పూర్తి అవగాహన కలిగి గృహాల గణనలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి వివరాన్ని కచ్చితంగా నమోదు చేసే విధానాన్ని సమగ్రంగా చేపట్టాలన్నారు. ప్రతి అధికారి తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. అలాగే ఎన్యూమరేటర్లు , సూపర్వైజర్లకు శిక్షణను సమగ్రంగా, నాణ్యంగా అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ , మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్, సంబంధిత అధికారులు, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని ఆధునిక సౌకర్యాలు గల వేడుక ఫంక్షన్ హాల్ ప్రారంభం



ప్రజా స్ఫూర్తి, నల్గొండ: నల్లగొండ బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వేడుక ఫంక్షన్ హాల్ ను రాష్ట్ర రోడ్లు, భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నల్లగొండ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇటువంటి ఆధునిక సౌకర్యాలతో కూడిన వేదికలు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమే కాకుండా, ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.అభివృద్ధి మరియు ప్రజాసేవే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ప్రాంతం సమగ్ర అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫంక్షన్ హాల్ నిర్వాహకులు టి. సరిత సురేష్ రెడ్డి , సాత్విక, భరత్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# వైద్యశాలలపై మరింత పర్యవేక్షణ పెరగాలి

* **సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: వైద్యశాలలపై మరింత పర్యవేక్షణ పెరగాలని, ప్రజారోగ్యం పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జిల్లా వైద్యశాల మొదలుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు ఎక్కడా మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాన్య ప్రజలు నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తారని, వారికి అందుబాటులో ఉన్న వనరులతోనే నాణ్యమైన చికిత్స అందించి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. వైద్యశాలల్లో



రోగులకు, సహాయకులకు కావాల్సిన సదుపాయాలు సమకూర్చాలని, పారిశుధ్యం, నీటి వసతి వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను బలోపేతం చేయాలని, మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, అవసరమైన వైద్య పరికరాలు మరియు మందుల నిల్వలపై సమగ్ర నివేదికను వెంటనే తనకు అందజేయాలని అధికారులను కోరారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో పనిచేయాలని, అప్పుడే పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని ఆయన ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రామవరంలో పోతులూరి వీరబ్రహ్మం ఆరాధన



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:రామవరం నెహ్రూ బస్తిలో వెలిసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మం 333వ ఆరాధన ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూబస్తిలోని బ్రహ్మంగారి గుడిలో జరిగిన పూజ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునగడప వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ బ్రహ్మంగారు రచించిన కాలజ్ఞానం సమాజాన్ని ఒక మార్గంలో నడిపించడానికి దిక్సూచిగా పనిచేస్తుందని అన్నారు. కులం లేదు, మతం లేదని మానవులంతా ఒక్కటే అని వేల సంవత్సరాల క్రితం చెప్పిన గొప్పతాత్వికుడు, దైవాంశ సంభూతులు వీర బ్రహ్మం గారేనని పేర్కొన్నారు. వర్గ, వైషమ్యాలు లేనటువంటి సమ సమాజ స్థాపన, మానవులంతా ఒకటే అని ఆకాంక్షించిన గొప్ప మానవతావాది, తాత్వికుడు వీర బ్రహ్మంగారని అన్నారు. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి ఆశీస్సులు ప్రజలకు ఎప్పుడూ ఉండాలని, ప్రజలు ఆయన ఆశించిన మార్గంలో నడిసి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం మన మానవాళిపై ఉందని మునిగడప పేర్కొన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు పూజా కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు విజయగిరి రాజనంద చారి, నవీన్ చారి, పూజారి ప్రవీణ్, మద్దోజు గణేష్, సాగర్ భాగ్యలక్ష్మీ , శృతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైశాఖ శుక్ల పక్షదశమి వాసవి మాత జయంతి ఉత్సవాలు

భువనగిరి , ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో ,జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు వాసవి మాతా జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , జిల్లా యువజన క్రీడాల అధికారి ధనంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు జ్యోతి ప్రజ్వలన గావించి,పూల మాలతో అమ్మ వారికీ అలంకరించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘాల అభ్యర్థన మేరకు, వాసవీ మాత జయంతిని (వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి జయంతి) రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఈ నిర్ణయంతో 26ఏప్రిల్ 2026న,తెలంగాణవ్యాప్తంగా ఉన్న వాసవి దేవాలయాలు, ఆర్యవైశ్య సత్రాలలో ప్రభుత్వ లాంఛనాలతో వేడుకలు జరగుతున్నాయని తెలియ జేశారు. జిల్లా యువజన మరియు క్రీడాల అధికారి కే ధనంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏటా 'వైశాఖ శుక్ల పక్ష దశమి' రోజున వాసవీ మాత జయంతి అని దీనిలో భాగంగా ఈ సంవత్సరం వాసవీ మాత పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహిస్తునామని వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల ఆర్యవైశ్య సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వాసవి సంఘం అధ్యక్షులు మహేష్, జిల్లా అధ్యక్షులు కె.చంద్రశేఖర్,వాసవి సంఘం రీజినల్ సెక్రటరీ ఎ. రమేష్, వాసవి సంఘం సెక్రటరీ జే.హనుమంతరావు, వాసవి మెంబర్లు, పీ.మనోహర్, ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్.కృష్ణ మూర్తి, జి.శ్రీనివాస్, పీ.సోమన్న, కె.రాజేందర్, కార్యాలయ సిబ్బంది మురళి , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలి

* **మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : వాసవి మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్ర రోడ్లు ,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నల్గొండ పట్టణంలోని బీట్ మార్కెట్‌లోని రామకోటి స్థూప దేవాలయం మరియు గాంధీ పార్క్లో ఘనంగా నిర్వహించిన వాసవి మాత జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుపుకుంటున్న తొలి వాసవి మాత జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహించడం విశేషమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.బాసర, కాళేశ్వరం దేవాలయాలు , గోదావరి పుష్కరాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే, రామకోటి దేవాలయానికి 20 సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుంటూ, ధ్వజస్తంభం, మార్కెట్ యార్డ్ స్థలం 120 గజాలు , దేవాలయ అభివృద్ధికి మరో 120 గజాలు అందజేసినట్లు చెప్పారు. గుడి ఎదుట పండ్ల మార్కెట్ ఏర్పాటు చేస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకున్నానని వివరించారు. పట్టణంలో రామాలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, వచ్చే సంవత్సరం ఉత్తర ద్వార దర్శనం వరకు పూర్తి చేస్తామని తెలిపారు. గాంధీ పార్క్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాంధీ పార్క్లోని భవనాన్ని పునర్నిర్మించేందుకు పూర్తి సహకారం అందిస్తామని, ప్రస్తుతం బాట లేని సమస్యను పరిష్కరించి, డీఎంహెచ్ఓ కార్యాలయం మారిన వెంటనే రహదారి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, బ్రహ్మంగారి గుట్టలోని శివాలయ అభివృద్ధి పనులను రూ.100 కోట్లతో రెండు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు.ప్రకాశం బజార్ వ్యాపారుల అభివృద్ధి కోసం ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని సమయాల్లో ప్రజలకు అండగా ఉంటానని మంత్రి స్పష్టం చేశారు. భక్తి, సేవ, అభివృద్ధి అనే మూడు అంశాలలో పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి,తహసిల్దార్ పరుశురాం ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగొనిరమేష్,మాజీ జెడ్పిటిసి గుమ్మలమోహన్ రెడ్డి,మాజీ జెడ్పిసి వంగూరు లక్ష్మయ్య, కార్పొరేటర్లు కవిత ,పెరిక స్వాతి, ఆర్యవైశ్య సంఘం సభ్యురాలు నాంపల్లి భాగ్య, నరసింహ, యమ మురళి, దైవాదినం,ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు .

# కరాటే ఆత్మ రక్షణకు ఎంతగానో దోహదం



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కరాటే ఆత్మ రక్షణకు ఎంతగానో దోహదపడుతుందని విక్టరీ మార్షల్ ఆర్ట్స్ అకాడమిక్ ప్రధాన సలహాదారులు బీసు వెంకటేశం గౌడ్ అన్నారు. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలోని జరిగిన గిన్నిస్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ పోటీలలో చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ కు చెందిన విక్టరి మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో కరాటే లో శిక్షణ పొందిన విద్యార్థులు ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారు పాల్గొన్నారు.వీరికి త్వరలోగిన్నిస్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు..ఈ సందర్భంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ కు ఎంపికైన విద్యార్థులు మాస్టర్ కె.నరేష్,బీసు భరత్ కుమార్ గౌడ్,సేమియాన్ జతిన్,ఓంకార్,రాధాకృష్ణ, అఖిలేశ్వర్, చరిత్, లను విక్టరీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధులు గ్రాండ్ మాస్టర్ కావలి ఎల్లేష్,కావలి మహేష్,తోపాటు పలువురు వీరిని అభినందించారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఐ.డి.ఓ.సీ (కలెక్టరేట్) కార్యాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ అహింసా మార్గంలో ధర్మాన్ని రక్షించిన గొప్ప వీరనారి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు అని కొనియాడారు. ఆమె చూపిన శాంతి, త్యాగనిరతి నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లాలోని ఆర్యవైశ్య ప్రముఖులతోపాటు డీఐఈఓ వెంకటేశ్వర్లు, ఈడీఎస్‌సి కార్పొరేషన్ ఉపేందర్, లేబర్ ఆఫీసర్ షరీపుద్దీన్, డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు దారా నగేష్, జిల్లా అధ్యక్షులు దారా రమేష్, అన్నదాన సత్రం అధ్యక్షులు కంభంపాటి రమేష్, దాల్‌మిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొదుమూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సమృద్ధిగా పెట్రోల్, డీజిల్

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై ఎలాంటి కొరత లేదని, ప్రజలు అనవసర భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని పౌర సరఫరాల శాఖ అదనపు సంచాలకులు రోహిత్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులతోపౌర సరఫరాల శాఖ అదనపు సంచాలకులు రోహిత్ సింగ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో ఇంధన లభ్యతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం 83 పెట్రోల్ బంకులు ఉండగా, అన్ని బంకుల్లోనూ పెట్రోల్, డీజిల్ సరఫరా సాధారణంగా కొనసాగుతోందని తెలిపారు. కొంతమంది ప్రజలు అనవసరంగా భయాందోళనలకు లోనై ప్లాస్టిక్ కేన్లలో ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించడం వల్ల తాత్కాలికంగా కొన్ని చోట్ల ఇంధనం త్వరగా అమ్ముడవుతున్నదని చెప్పారు. అయితే జిల్లాలో ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. రేపటి నుండి ప్రభుత్వరంగ చమురు సంస్థలు అవసరమైన మేరకు పెట్రోల్, డీజిల్ సరఫరా పెంచేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ

* **ఎమ్మెల్యే మేఘా రెడ్డి సహకారంతో జర్నలిస్టులకు న్యాయం**
* **టీయూడబ్ల్యు.జే (ఐజేయు )జిల్లా అధ్యక్షులు మాధవ రావు**



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా : వనపర్తి ఎమ్మెల్యే తూడీ మేఘా రెడ్డి సహకారంతో వనపర్తి జిల్లాలోని అర్హులైన జర్నలిస్టుల అందరికి అక్రిడిటేషన్ కార్డుల విషయంలో న్యాయం జరుగుతుందని టీయూడబ్ల్యు. జే (ఐజేయు ) జిల్లా అధ్యక్షులు డీ. మాధవ రావు పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు వచ్చేలా చూడాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు మాధవ రావు ఎమ్మెల్యే మేఘా రెడ్డి ని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు మాధవరావు తెలిపారు.

# బద్రి నారాయణ సేవ లో భట్టాచార్య సోదరులు



అందోలు, ప్రజాస్ఫూర్తి :ఉత్తరాఖండ్ లో సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం, చార్ధాం లో ఒకటైన శ్రీ బద్రీనాథ్ ఆలయం ఏడాది లో 6 నెలలు మాత్రమే దర్శనానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఉంటుంది. అత్యంత వ్యయ, ప్రయాసలతో కూడుకున్న చల్లటి మంచుకొండల్లో ప్రముఖ పుణ్య క్షేత్రం దర్శనం కోసం స్థానిక భక్తుల తోకలిసి సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వాస్తు, జ్యోతిష్య నిపుణులు, ధార్మికవేత్త, శ్రీ పరాశర. సుదర్శన బట్టాచార్యా వారి సోదరులు శ్రీ. పరాశర. శ్రీరామ బట్టాచార్యా పర్యవేక్షణలో బద్రి నారాయణ స్వామి దర్శనాలు లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మే డే ను జయప్రదం చేయండి



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: కూరగాయల మార్కెట్ హామాలి సమావేశం సతీష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కుమ్మరి కుంట్ల నాగన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లక్షలాదిమంది సంఘటిత ఉద్యోగ శ్రమజీవులుగా చాలీచాలని అతి తక్కువ వేతనాలు జీతాలు పని భద్రత లేకుండా ఎనిమిది గంటల పనికన్నా అదనపు పనిగంటలు యజమానులు చెప్పిన టైం వరకు అదనపు శ్రమదోపిడి గురి అవుతూ కాంట్రాక్టర్ రంగా కార్మికులుగా కనీస వేతనాలు లేకుండా కార్మికులు పేదరికంలోకి కుటుంబాల పోషణకు అప్పులు చేస్తూ జీవితాలు మరింత దుర్భరంగా మారుతున్నాయి మే డే స్పూర్తితో పోరాడి కార్మిక హక్కులు సాధించుకొని కార్మికులు అంటే బానిసలు కాదని సంపదలో భాగస్వాములను ప్రభుత్వాలు పెట్టుబడుదారులు నుండి శ్రమకు తగిన ఫలితం దక్కేవరకు పోరాడుదాం అని అన్నారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికుడికి 6000 పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రమాదంలో చనిపోతే ప్రభుత్వమే 25 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ఈఎస్ఐపిఎఫ్ సాగర్ కల్పించాలని ఇండ్లు లేని నిరుపేదలకు ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ స్పందించి డిమాండ్ ను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెదరమెట్ల వెంకటరావు, సముద్రాల వెంకన్న, శీను, రాము జీవన్, వెంకన్న, రాజేష్, రాములు, వెంకటేష్, దర్గయ్య, మోహన్, రాజు, కృష్ణ, ముత్తయ్య యాకన్న నాగరాజ్, శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

## పీర్జాదిగూడ మాజీ మేయర్ గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : పీర్జాదిగూడ మాజీ మేయర జక్కా వెంకట్ రెడ్డి, క్రాంతి నూతన గృహప్రవేశం వేడుకల్లో పాల్గొని వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, పిఏంసి ప్రధాన కార్యదర్శి ఏడవెల్లి రఘువర్దన్ రెడ్డి, కసిరెడ్డి అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ గణన కార్యక్రమంలో వివరాలు నమోదు చేసుకున్న మున్సిపల్ చైర్పర్సన్

* **ఈనెల 26వ తారీకు నుండి మే 10 వరకు కొనసాగనున్న స్వీయ గణన కార్యక్రమం**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ సూచనలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం నుండి మే 10 వరకు జిల్లా వ్యాప్తంగా స్వీయ జనగణన కార్యక్రమం ప్రారంభం అయింది, ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక బృందాల సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు కార్యకర్తలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, పుర ప్రముఖులు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ స్వీయ జన గణన కార్యక్రమంలో పాల్గొని సంబంధిత వివరాలు ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకుని ఉండాలని సూచించిన నేపథ్యంలో మహబూబాబాద్ పట్టణం మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి, తన స్వయ జనగణన కార్యక్రమాన్ని నమోదు చేసుకున్నారు. గణాంక అధికారి వారి ఇంటికి వెళ్లి వివరాలను స్వీకరించి నమోదు చేశారు, ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న జన గణన స్వీయ కార్యక్రమం లో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ వివరాలను నమోదు చేసుకుని గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని, మున్సిపల్ పరిధిలోని అందరు కౌన్సిలర్లు విధిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలి అన్నారు, ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, తహసిల్దార్ రాజేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా నేడు ఎరువుల షాపులు బంద్



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఎరువుల షాపులు బంద్ చేయనున్నారు. ఉత్పత్తిదారుల విధానాలను నిరసిస్తూ డీలర్లు బంద్ పాటించనున్నట్లు రాష్ట్ర ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఎరువుల సరఫరాపై ఎఫ్పీఎల్ విధానాన్ని అమలు చేయాలని, లింక్ ప్రొడక్ట్ లేకుండా ఎరువులు అందించాలని డీలర్లు డిమాండ్ చేస్తున్నారు... వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా కూడా కొనసాగుతుందని డీలర్స్ యూనియన్ వెల్లడించారు.

## భారాస ఆవిర్భావంతోనే తెలంగాణ కల సాకారమైంది



కొండపాక గ్రామీణం : భారాస (నాటి తెరాస) ఆవిర్భావంతోనే తెలంగాణ కల సాకారమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడలో నూతనంగా నిర్మించిన చౌడాలమ్మ ఆలయంలో అమ్మవారిని ఆయన ఆదివారం దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏప్రిల్ 27న భారాస పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. భారాస పార్టీ పుట్టడం వల్లే తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో, సంతోషంగా ముందుగా సాగుతున్నారన్నారు. కేసీఆర్ లేకపోతే భారాస పార్టీ లేదు.. భారాస పార్టీ లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదు అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పడిందన్నా.. 33 జిల్లాలుగా పరిపాలన కొనసాగుతోందన్నా.. అది కేసీఆర్ కృషేనని చెప్పారు. బీడువారిన ఈ నేలను కాళేశ్వరం ప్రాజెక్టు జలాలు ముద్దాడుతున్నాయంటే.. భారాస పార్టీ వల్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు నూనె కుమార్, అధ్యక్షుడు గుండెల్లి ఆంజనేయులు, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## 'సామాన్యులకు నివాస స్థలాలను అందుబాటులోకి తేవడమే లక్ష్యం'



హైదరాబాద్: పర్యావరణహితమైన, అన్ని వసతులతో కూడిన నివాస స్థలాలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని స్వర్గసీమ శాండల్ వుడ్ ఫార్మ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ చంద్ర చంద్రశేఖర్ అన్నారు. తిర్మలాపూర్, బాలానగర్ ప్రాంతాల్లో చేపట్టిన విభవ ప్లాటింగ్ ప్రాజెక్ట్ లోగో, బ్రోచర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 78 ఎకరాల విస్తీర్ణంలో రూపొందించిన ఈ వెంచర్‌లో నివాసితుల కోసం 8 ఎకరాల్లో 9 రకాల థీమ్ పార్కులను ఏర్పాటు చేయడంతోపాటు రెండెకరాలను పాఠశాలకు కేటాయించినట్లు వివరించారు.

## ప్రపంచ కార్మికులారా ఏకంకండి మేడే ను జయప్రదం చేయండి

* **సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ పట్టణంలోని మల్లు స్వరాజ్యం నగర్ కాలనిలో సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యుడు కుమ్మరికుంట్ల నాగన్న అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ మాట్లాడుతూ బానిస బతుకులకు చామర గీతం పాడి పోరాటం ద్వారా హక్కులన్నీ దక్కుతాయాన్ని చాటి చెప్పిన రోజే మేడే. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికలోకం కధం తొక్కిన రోజు. రక్తాన్ని చిందించి 8గంటల పని హక్కును దక్కించుకున్న రోజు మేడే. ప్రపంచ కార్మిక ఉద్యమానికి ప్రతికగా ప్రతి ఏడాది మే 1నా కార్మిక దినోత్సవం జరుపుకుంటారని అన్నారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేది ఏమిలేదు బానిస సంకెళ్లు తప్ప అన్న నినాదలు ప్రపంచ కార్మిక గతినే మార్చేసాయి. చికాగో కార్మిక పోరాట స్ఫూర్తి ప్రపంచ కార్మికుల్లో ఉద్యమా వేడిని రగిలించాయి అని అన్నారు. అమెరికా లో కార్మికులు చిందించిన నెత్తురే ఎర్ర జండాగా అవతరించింది. 8గంటల పనికోసం సమర శింఖం పూరించింది డిమాండ్ల సాధనకోసం కార్మికులు ఐక్యంగా అమరుల రక్తంలో తడిసి నింగికెగసిందే ఎర్రజండా అని అన్నారు. మే 1నా ప్రపంచ కార్మిక దినోత్సవం జరుపుకోవాలని ఆ రోజు శ్రామికులందరు తమ పనికి విరామం ఇచ్చి ఇదులోకి వచ్చి తమ గొంతు వినిపించాలని ప్యారిస్ లో జరిగిన సోషలిస్ట్ లేబర్ పార్టీల షేకెట్ ఇంటర్ నేషనల్ సమావేశం తీర్మానించింది అదే అనేక దేశాలలో మేడే గా మారిందని అన్నారు. ఈ పోరాట స్పూర్తితో 8గంటల పని దినాలు వేతనాల పెంపు భద్రతకోసం ఉద్యమాలు ఉదృతమయ్యాయి. ఈ పరిమానాలు 1917లో రష్యా లో మొదటి సోషలిస్టు ప్రభుత్వం రావటానికి దారితీసిందని అన్నారు. అమర వీరుల ఆశయాలకు స్పూర్తితో మే 1 నా మహబూబాబాద్ పట్టణంలో మేడే ను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణంలో అన్ని శాఖలు కాలనీలనుండి ప్రజలు వెలదిగా ర్యాలీ నిర్వహించాలని సిపిఎం శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి లు పార్టీ సభ్యులు ప్రజలు పాల్గున్నారు..

## గుడుంబా, డ్రగ్స్ రహిత తెలంగాణ



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు, జె సి ఎన్ఫోర్స్మెంట్, డి సి వరంగల్ అంజన్ రావు సూచనల మేరకు ఈ నెల 21 తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గుడుంబా తయారీ కోసం ఉపయోగించే నల్ల బెల్లం, పటిక, గుడుంబా అక్రమ రవాణాకు సంబంధించి ఎన్ఫోర్స్మెంట్ వరంగల్ టీమ్ కు రాబడిన విశ్వసనియమైన సమాచారం మేరకు మహబూబాబాద్ లోని సుందరయ్య నగర్, ఎటిగడ్డ తండా మధ్యన ఆదివారం ఉదయం డి శ్రీనివాస్ రెడ్డి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్ఫోర్స్మెంట్ వరంగల్ పర్యవేక్షణలో వాహన తనిఖీలు చేయగా ఏపీ 39 టి టి 3752 నంబర్ గల వాహనం వాహనంలో 1750 కేజీల నల్ల బెల్లం, 100 కేజీల పట్టిక 20 లీటర్ల నాటు సార రవాణా చేస్తుండగా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మరియు సిబ్బంది, వాహనం, అందులో కల నల్లబెల్లం, పట్టిక నాటుసారా స్వాధీన పరుచుకొని ముద్దాయి. ఎ 1 కొరవి రవితేజ, నివాసం, చిలకలూరిపేట, ఆంధ్ర ప్రదేశ్ అను అతనిని అదుపులోనికి తీసుకొని విచారించగా ఇట్టి నల్లబెల్లం మరియు పటికను ఎ 2) బానోత్ ప్రసాద్, నివాసం సూర్య తండా, సిరోల్ మండలం అను అతనితో కలిసి చిత్తూరులో తక్కువ ధరకు తీసుకువచ్చి సుందరయ్య నగర్, ఏటిగడ్డ తండా, సిరోలు మండలంలోని సూర్య తండా లలో అధిక ధరకు విక్రయించి మరియు వారివద్ద నుండి నాటు సారాను కొనుగోలు చేసి పట్టణాలలో అమ్ముతూ ఉంటామని వచ్చిన లాభం ఇద్దరం సమానంగా పంచుకుంటాం అని నేరాన్ని అంగీకరించినారు. తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం, ముద్దాయి ని, వాహనం తో పాటు స్వాధీనం చేసుకున్న నల్ల బెల్లం, పటిక నాటు సార, మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ నందు అప్పగించడం జరిగింది. నాటుసార విక్రయం, రవాణా, నాటుసారా తయారీ కోసం ఉపయోగించే ముడి పదార్థాలు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించే వారిపైన, సేవించే వారిపైన ఎక్సైజ్ ప్రత్యేక బృందాలు నిఘా పెట్టాయి.. వారిపైన చట్టప్రకారం చర్యలు ఉంటాయి. తెలంగాణ ప్రభుత్వం లక్ష్యాలకు అనుగుణంగ డ్రగ్స్ మరియు గుడుంబ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో మీడియా, ప్రజలు, యువత ఎక్సైజ్ శాఖ కు సహకరించాలని విజ్ఞప్తి. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ ఎక్సైజ్ సిఐ లు నాగేశ్వరరావు, చంద్రశేఖర్, జి చిరంజీవి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, సిబ్బంది సత్యనారాయణ, శ్రీనివాస్ కుమార్, శరత్ లు పాల్గొన్నారు

## భద్రాచలంలో అట్టహాసంగా కళావాహన



భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతా రామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో శ్రీరామనవమికి నిర్వహించే కల్యాణోత్సవం ప్రపంచ దేశాలకు ఆదర్శనీయంగా మారిందని త్రిదండి చిన జీయర్‌స్వామి ప్రవచించారు. ఉత్తరాన ఉన్న అయోధ్యలో భవ్య మందిరం నిర్మాణం వల్ల చరిత్రకు పడిన మచ్చ చెరిగిందని దక్షిణ అయోధ్యగా విశ్వవ్యాప్త కీర్తి పొందిన భద్రాచల రామాలయం సంప్రదాయాలకు నిలయమై భాసిల్లుతోందన్నారు. ప్రధాన రామాలయాన్ని యథాతథంగా ఉంచి బృహత్తర ప్రణాళిక తొలి విడత కింద రూ.351 కోట్లతో అనుబంధ ఆలయాలను తొలగించి నూతన నిర్మాణాలు చేయనున్నారు. ఇందుకు గాను ముందస్తుగా అనుబంధ ఆలయాల్లోని విగ్రహాలను ఇక్కడ నుంచి తరలించి మరోచోట ప్రతిష్ఠించేందుకు ఆగమ శాస్త్రం ప్రకారం జీర్ణోద్ధరణ కళావాహన పూజ ఆదివారం అట్టహాసంగా సాగింది. ధ్రువమూర్తుల అనుజ్ఞ తీసుకుని భక్త రామదాసు విగ్రహంతోపాటు ఆళ్వార్ల గుడుల వద్ద హారతులు అందించి హోమాలను చేసి కలశాలలో కళావాహన నిర్వహించారు. నిత్య కల్యాణ మండపం వద్ద చినజీయర్ స్వామి ప్రవచించారు. ఇది పరాభవ నామ సంవత్సరమని భగవంతుణ్ని దూషించే వారికి సంప్రదాయాలను, ధర్మాలను వేలెత్తి చూపించే వారికి పరాభవం కలిగించగలిగిన వారు రాముడు అని అన్నారు. ఈ జీర్ణోద్ధరణ వల్ల మనుషుల్లో చెడు తొలగి మంచి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కళావాహన సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆర్జిత సేవలతోపాటు దర్శనాలను నిలిపివేశారు. మధ్యాహ్నం 3 నుంచి దర్శనం కల్పించారు. ఈఓ దామోదర్‌రావు, స్థానాచార్యులు స్థలసాయి, ప్రధానార్చకులు విజయరాఘవన్, రామస్వరూప్, భక్త రామదాసు పదోతరం వారసుడు కంచెర్ల శ్రీనివాసరావు, వైదిక పెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు సందడి



హైదరాబాద్: వరికోతలు పూర్తి కాలేదు.. ధాన్యం కొనుగోళ్లు మొదలే కాలేదు.. అయినా రైతులు కల్లాల్లో టార్పాలిన్లు పరిచి తమ స్థలాన్ని రిజర్వు చేసుకుంటున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జూలూరులో కనిపించిన దృశ్యమిది. అన్నదాతల ముందస్తు సంసిద్ధతతో ధాన్యం కొనుగోళ్లు నిర్వహించే స్థలాల్లో సందడి మొదలైంది. టార్పాలిన్లు పరచడమే కాదు.. అవి గాలికి ఎగిరిపోకుండా వాటిపై ఇలా రాళ్లను కూడా పెట్టారు.

## లేబర్ కోడ్స్ రద్దు నినాదంతో 140వ మేడే దినోత్సవాన్ని జరుపుదాం

* **ఐఎఫ్టియు నాయకులు హలవత్ లింగన్న, పర్వత కోటేష్**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : కార్మికులు పోరాడి సాధించుకున్న 140 మే డే దినోత్సవాన్ని లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ తో నిర్వహించాలని ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు కామ్రేడ్ హలవత్ లింగన్న మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ పర్వత కోటేష్ లు కార్మికులకు పిలుపునిచ్చారు. మహబూబాబాద్పట్టణంలోనీ బట్టు అంజయ్య స్మారక భవనం ఐఎఫ్టియు ఆధ్వర్యంలో మేడే గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లింగన్న, కోటేష్ లు మాట్లాడుతూ అమెరికాలోని చికాగో లో 8 గంటల పని దినానికై కార్మికుల పోరాట ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానం నేడు అమలవుతుందని వారు తెలిపారు. నరేంద్ర మోడీ కార్మికుల శ్రేయోభిలాషి అంటూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి, 12 గంటల పని విధానం తీసుకురావడంలో మోడీ అసలు రూపం బయటపడిందని వారన్నారు. సామ్రాజ్యవాద అమెరికా దురహంకార యుద్ధాన్ని ప్రజలు ఖండించాలని వారు పిలుపునిచ్చారు. మేడే అమరవీరుల స్ఫూర్తితో హక్కులకై ఉద్యమించినప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి జబ్బర్ జిల్లా నాయకులు తెల బోయిన కృష్ణ అల్లి ఏకాంబరం సురేష్ కట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందూ సమ్మేళనం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: హిందూ సమ్మేళన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఆదివారం సాయంత్రం హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇస్కాన్ మోటివేషనల్ స్పీకర్ కీర్తి రాజదాసు ప్రభు జి, అరుణాచల ఉపసకులు అరుణాచల స్వామీజీ, ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచార లింగం శ్రీధర్, వనవాసి కళ్యాణ పరిషత్ తెలంగాణ ప్రాంత సహ మహిళా ప్రముఖ పెద్దాడు ఆశాలత హాజరయ్యారు. కొత్తగూడెం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి హిందూ బంధువులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ బృందంచే హనుమాన్ చాలీసా పారాయణ, భాస్కర్ బృందం చే భక్తి గీతాలు, సీతా ప్రసాద్ శిష్య బృందంచే నృత్య కళా ప్రదర్శన నిర్వహించారు.

## అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ కాలరాస్తోంది: కిషన్‌రెడ్డి

**హస్తం పార్టీ మహిళా ద్రోహిగా మారింది: బండి సంజయ్**



సోమాజిగూడ: మహిళల సాధికారతను, అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కాలరాస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సోమాజిగూడలో జరిగిన అంబేడ్కర్ జయంతి ముగింపు ఉత్సవాల్లో మరో కేంద్ర మంత్రి బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తదితరులతో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు, దళితులు, గిరిజనులు చట్టసభల్లో అడుగు పెట్టకుండా కాంగ్రెస్ దశాబ్దాలుగా అడ్డు పడుతోందని విమర్శించారు. రిజర్వేషన్ బిల్లు విషయంలో భారాస సైతం తన బాధ్యతను విస్మరించి.. ప్రజలను తప్పుదోవ పట్టించిందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతోందంటూ రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి, స్టాలిన్ వంటి నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బీసీ జనగణన తొలిసారిగా చేస్తున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు.

**రాష్ట్రానికి మోదీ**

ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణ రాష్ట్రానికి దాదాపు రూ.700 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వస్తున్నారని.. ఈ పర్యటన రాష్ట్ర వికాసానికి కొత్త దిశను చూపనుందన్నారు కిషన్‌రెడ్డి. మే 10న ప్రారంభోత్సవాల అనంతరం పరేడ్ మైదానంలో బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. బండి సంజయ్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును మోదీ ప్రభుత్వం తీసుకొస్తే కాంగ్రెస్ అడ్డుకుని మహిళా ద్రోహిగా మారిందన్నారు. అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వడానికి ఒప్పుకోని కాంగ్రెస్ ఆయన్ను ఓడించిన వ్యక్తికి ఇచ్చిందని విమర్శించారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ.. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు.

# బీసీ గురుకులం... కొలువుల ప్రాంగణం



* ఫైనలియర్‌లో 50% మంది విద్యార్థులకు ఉద్యోగాలు
* వివిధ కార్పొరేట్ సంస్థల్లో అవకాశాలు

హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకుల సొసైటీ.. ప్రాంగణ నియామకాల్లో ఉత్తమ ఫలితాలు సాధించింది. డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీఎస్సీ, బీకాం, ఇతర కోర్సులు చదువుతున్న చివరి సంవత్సరం(ఫైనలియర్) విద్యార్థినీ, విద్యార్థుల్లో దాదాపు 50% మంది వివిధ కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందారు. ప్రొఫెషనల్ కోర్సులు బోధిస్తున్న కళాశాలల్లో ప్రాంగణ నియామకాలు గగనమైన పరిస్థితుల్లో... 202526 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన బీసీ గురుకుల విద్యార్థులు అధిక సంఖ్యలో కొలువులు సాధించి ఔరా..! అనిపించారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను మొదటి సంవత్సరం నుంచే అందించడం, ఉత్తమ బోధన, మెరుగైన మార్కులతో క్యాంపస్ నియామకాల్లో పాల్గొన్న వారిలో అత్యధికులకు ఉద్యోగాలు లభించాయి. ఇప్పటివరకు జరిగిన ప్రాంగణ నియామకాల్లో ఏడు కళాశాలల పరిధిలో 1,045 మంది విద్యార్థులకు 501 మంది ఉద్యోగాలకు ఎంపికవడం గమనార్హం. క్యాంపస్ నియామక ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందున ఎక్కువ మందికి ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయని సొసైటీ వర్గాలు వెల్లడించాయి.

**టాప్‌లో వర్గల్ డిగ్రీ కళాశాల...**

ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల సొసైటీల్లో డిగ్రీ కళాశాలను ప్రారంభించాలని భావించినపుడు పైలట్ ప్రాజెక్టు కింద బీసీ గురుకుల సొసైటీ పరిధిలో మెదక్ జిల్లా వర్గల్‌లో బీసీ గురుకుల డిగ్రీ మహిళా కళాశాల ఏర్పాటైంది. ఈ గురుకుల డిగ్రీ కళాశాల సాధించిన ఫలితాలను విశ్లేషించాక... ఎస్సీ, ఎస్టీ, బీసీ సొసైటీల్లో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేశారు. అకడమిక్ ఫలితాల్లో రికార్డు నెలకొల్పుతున్న వర్గల్ కళాశాల... క్యాంపస్ ప్లేస్‌మెంట్లలోనూ అగ్రస్థానంలో నిలిచింది. ఈ కళాశాలలో 292 మంది ఫైనలియర్ విద్యార్థులు ఉంటే...క్యాంపస్ ఉద్యోగ మేళాకు 243 మంది హాజరయ్యారు. వీరిలో 185 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.



## మీ టైం పూర్తయ్యింది..
## మా టైం మొదలైంది: కవిత

హైదరాబాద్: పార్టీ ఆవిర్భావం తర్వాత టీఆర్ఎస్ అధినేత్రి కవిత 'ఎక్స్'లో ఆసక్తికర పోస్టు చేశారు. 'మీ టైం పూర్తయ్యింది..మా టైం మొదలైంది.. #TRS' అంటూ పోస్టు పెట్టారు. శనివారం మునీరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన సభలో తన పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)గా కవిత ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్, బీఆర్ఎస్ లక్ష్యంగా కవిత విమర్శలు గుప్పించారు.

## ఆసుపత్రిలో దుశర్ల సత్యనారాయణను
## పరామర్శించిన మంత్రి కొండా సురేఖ

* ఇటీవల పర్యావరణవేత్త దుశర్ల సత్యనారాయణపై దాడి
* దాడిని హేయమైన చర్యగా పేర్కొన్న మంత్రి కొండా సురేఖ
* కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
* నల్లొండ ఫ్లోరోసిస్ సమస్యపై ఆయన పోరాటాన్ని గుర్తు చేసుకున్న మంత్రి



ప్రముఖ పర్యావరణవేత్త, జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుశర్ల సత్యనారాయణపై జరిగిన దాడిని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. ఇది మానవత్వంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. దాడిలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను ఆమె పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సత్యనారాయణ గాయపడిన శరీరం విధ్వంసానికి గురైన అడవిలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు, నీటి హక్కులకు జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిపై దాడి చేయడం మానవ మనుగడపై దాడి చేయడంతో సమానమని అన్నారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యపై సత్యనారాయణ చేసిన పోరాటాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. పాదయాత్రలతో ఢిల్లీ వరకు వెళ్లి, అప్పటి ప్రధాని వాజ్‌పేయికి సమస్య తీవ్రతను వివరించారని కొనియాడారు. దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నల్గొండ ఎస్పీ నరసింహను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. సత్యనారాయణకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన సృష్టించిన 70 ఎకరాల అడవి పరిరక్షణకు వన మహోత్సవం నిధుల నుంచి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సత్యనారాయణను స్ఫూర్తిగా తీసుకుని, ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్‌లో కమల్‌హాసన్‌ను మించిన నటులు ఉన్నారు: కేటీఆర్

హైదరాబాద్: 2023 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్ఎస్ బలం పెరిగిందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. స్కైరూట్ కంపెనీ తాము తెస్తే.. ఈ సీఎం రిబ్బన్ కట్ చేసి గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. ''మోసపు హామీలు నమ్మి.. ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. కాంగ్రెస్‌లో కమల్‌హాసన్‌ను మించిన నటులు ఉన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లు ఏమయ్యాయి? మూసీని దుర్గంధం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. రూ.3.70 లక్షల కోట్లు అప్పు చేశానని రేవంత్‌రెడ్డి అంగీకరించారు. దిల్లీకి మూటలు మోయటం తప్ప.. ఆయన చేసిందేమీ లేదు'' అని కేటీఆర్ ఆరోపించారు.



## పల్లెపల్లెకు ఆర్టీసీ బస్సులు నడుపుతాం: మంత్రి పొన్నం



ఉప్పునుంతల: రాష్ట్ర వ్యాప్తంగా రహదారి సౌకర్యం ఉన్న ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సులను నడుపుతూ ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిపైన ఉప్పునుంతల మండల పరిధిలోని డిండికట్ట మైసమ్మ ఆలయ కొత్త పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డా.వంశీకృష్ణతో కలిసి పాల్గొని ఆయన మాట్లాడారు. దేవాలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఇంకా బస్సులు వెళ్లని గ్రామాలను గుర్తించి బస్సుల్ని నడుపుతామన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరికీ సమాన న్యాయం కల్పిస్తున్నామన్నారు. మహిళాభివృద్ధిని కోరి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధిని కాంక్షించి పాలకమండలి పనిచేయాల్సి ఉందన్నారు. దేవాలయ చరిత్రలో మొదటి పాలకమండలి ఇదే అన్నారు. రూ.10 కోట్లతో పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో డిండి డ్యాంలో బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ రహదారిపైన ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడు ఎడ్ల నరేష్‌యాదవ్, సభ్యులతో దేవాదాయ శాఖ అధికారి మదన్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, నాయకులు కట్టా అనంతరెడ్డి, నర్సింహరావు, జగత్‌రెడ్డి, సీహెచ్.శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, కాశన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**డ్రైవర్‌పై దాడి.. స్పందించిన పొన్నం**

బస్సు ఆపలేదని నల్గొండ వద్ద డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటనపై మంత్రి పొన్నం స్పందించారు. దీనిపై జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడి విచారణకు ఆదేశించారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామన్నారు. డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## జనగణన.. సంక్షేమ పథకాలు
## పోతాయనే భయం వద్దు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: ప్రజాస్వామ్య దేశంలో గొప్ప కార్యక్రమం జనాభా లెక్కల సేకరణ అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జనగణనలో భాగంగా ఆయన ఆదివారం స్వీయ ధ్రువీకరణ చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనగణనలో తొలిసారి కులగణన జరుగుతోందన్నారు. వివరాలు చెప్తే సంక్షేమ పథకాలు తొలగిస్తారనే భయం వద్దన్నారు. అందరూ ధైర్యంతో వివరాలు ఇవ్వాలని కోరారు. ''ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్‌ను అభినందించాలి. దీని వల్ల నకిలీ ఓట్లు తగ్గించొచ్చు. నకిలీ ఓట్ల తొలగింపుతో పోలింగ్ పర్సంటేజ్ పెరిగింది. హైదరాబాద్‌లో పోలింగ్ పర్సంటేజ్ 50శాతం దాటడం లేదు. ఎస్ఐఆర్ పూర్తయితే ఇక్కడ కూడా పోలింగ్ పర్సంటేజ్ పెరుగుతుంది. తెలంగాణ పర్యటనకు రానున్న ప్రధాని మోదీ.. రైల్వే, జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు'' అని కిషన్‌రెడ్డి తెలిపారు.



## వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్.. 245 మందిపై కేసులు

సైబరాబాద్ : వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టి పట్టుబడిన 245 మందిపై కేసులు (Cases) నమోదు చేసినట్లు సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీI రంజన్ రతన్ కుమార్ తెలిపారు. హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడుపుతునవారిపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని.. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని చెప్పారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ఏవేవి ఎన్నంటే..**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 245 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 197 ద్విచక్ర వాహనదారులు, 12 ఆటోలు, 36 కార్లు, వాహనదారులపై కేసులు నమోదయ్యాయి అని పోలీసులు చెప్పారు. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బీఏసీ) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే 196 మంది 36 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 200 ఎంజీ/100 ఎంఎల్ మధ్య, 28 మంది 201 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 300 ఎంజీ/100 ఎంఎల్ మధ్య, 21 మంది 301 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ తీసుకొని పట్టుబడ్డారు. వీరందరినీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు రతన్ కుమార్ తెలిపారు.



**గత వారం కేసులు ఇలా..**

గత వారం (20 నుంచి 25 తేదీ మధ్య) లో మొత్తం 189 డ్రంక్ డ్రైవింగ్ కేసులకు కోర్టులో పరిష్కారం లభించిందన్నారు. వీరిలో ఇద్దరికి జరిమానా, సోషల్ సర్వీస్, 187 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు వెల్లడించారు.

## ప్రజావాణి సేవలు
## క్షేత్రస్థాయికి విస్తరించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రజావాణి సేవలు క్షేత్రస్థాయికి విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రజలకు ప్రజావాణి సేవలను మరింత చేరువ చేయాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని, మండల స్థాయికి విస్తరించాలని దిశానిర్దేశం చేశారు. అర్జీల పురోగతిని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. ''ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు ఉండాలి. అర్జీల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి డిజిటల్ ప్లాట్‌ఫాం ఉండాలి. ప్రతిస్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలి. అవసరమైతే అప్పీల్ వ్యవస్థ తీసుకురావాలి. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలి'' అని సీఎం అన్నారు.



## ఉత్సాహంగా క్యాన్సర్ అవేర్‌నెస్ మారథాన్.. జెండా ఊపి ప్రారంభించిన మంత్రి

హైదరాబాద్ : నగరంలో ఆదివారం ఉదయం గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ అవేర్‌నెస్ మారథాన్‌ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఘనంగా ప్రారంభించారు. గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మారథాన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఆరోగ్యవంతమైన చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజల్లో మార్పు వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులు, యువత, నిపుణులు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని పరుగెత్తారు. ఇలాంటి కార్యక్రమాలు నోటి క్యాన్సర్ నిరోధం, తొలి దశలో వ్యాధి గుర్తింపు, ఆరోగ్యకరమైన జీవనశైలి తదితర వాటిపై ప్రజల్లో అవగాహన పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉందన్నారు. ప్రజా ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, నివారణాత్మక వైద్య సేవలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను శ్రీధర్‌బాబు అభినందించారు.

# టీఎంసీ ఉన్నంతకాలం బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదు: మోదీ

తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నంతవరకు బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ (PM Narendra Modi) అన్నారు. స్త్రీలను హింసించే గూండాలకు ఆ పార్టీ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అందువల్లే రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఈసారి ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే మహా జంగిల్ రాజ్ నుంచి రక్షణ కల్పిస్తామన్నారు. మహిళల రక్షణ గురించి తాము ఆలోచిస్తాం కాబట్టే ఆర్జీకర్ మృతురాలి తల్లికి తమ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల టికెట్ ఇచ్చామన్నారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలపై దారుణాలకు పాల్పడిన నిందితులను న్యాయస్థానం ముందు నిలబెడతామన్నారు. బంగావ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తరచుగా బాలికలు అదృశ్యమవుతున్న కేసులు నమోదు అవుతున్నాయని మోదీ పేర్కొన్నారు. అయినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిద్రపోతోందని మండిపడ్డారు. మహిళలతో పాటు రైతులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్రంలో భాజపా కృషి చేస్తోందన్నారు. అందుకే గత 11ఏళ్లలో జనపనార కనీస మద్దతు ధరల(MSP)ను రెట్టింపు చేసిందన్నారు. గోధుమలు, బియ్యం కోసం 100 శాతం జనపనార ప్యాకేజింగ్‌ను



తప్పనిసరి చేశామని వెల్లడించారు. హుగ్లీ నది పరిసరాల్లో ఒకప్పుడు మిల్లులు, ఫ్యాక్టరీలు అధికంగా ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటన్నిటినీ మూసివేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వాటిని తిరిగి తెరిపిస్తామన్నారు. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్ అభివృద్ధి చెందాలంటే తాము అధికారం చేపట్టాల్సిందేనన్నారు.



## రష్యాలో కీలక ఎరువుల ప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి

వాయవ్య రష్యాలో కీలకమైన ఎరువుల ప్లాంట్ 'ఫోస్ అగ్రో'పై ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసింది. ఏప్రిల్ నెలలో ఈ ప్లాంట్‌పై జరిగిన రెండో దాడి ఇది. రష్యా కీలక ఎగుమతి కేంద్రాలపై ఇటీవల కాలంలో ఉక్రెయిన్ దాడులు తీవ్రమయ్యాయి. ఈ ప్లాంట్‌లోని సల్ఫ్యూరిక్ యాసిడ్ పంప్ చేసే హై ప్రెజర్ పైప్‌లైన్లను ఈ డ్రోన్లు ధ్వంసం చేశాయి. ఈ విషయాన్ని వోలోగ్డా గవర్నర్ జార్జి ఫిలిమోనోవ్ ధ్రువీకరించారు. కాకపోతే ఎటువంటి మంటలు లేదా లీకేజీకి ఈ దాడి కారణం కాలేదని వెల్లడించారు. పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతులు నిర్వహించినట్లు తెలిపారు. దీంతో ప్రమాదకర గ్యాస్‌లు కూడా ఏమీ లీక్ కాలేదని చెప్పారు. 'ఫోస్ అగ్రో' ప్రతినిధి మాత్రం ఈ దాడిపై స్పందించేందుకు నిరాకరించారు. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయిలో ఉండటంతో నైట్రోజన్ ఫర్టిలైజర్స్ ధరలు గణనీయంగా పెరిగాయి. దీంతోపాటు రష్యా, చైనా దేశాలు వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి ఫాస్ఫరస్ ఆధారిత ఎరువులను భారత్‌కు ఎగుమతి చేసే కంపెనీల్లో ఇది కూడా ఉంది.

## మాటల తూటాలు పేలుతాయన్న కరోలిన్.. చివరకు నిజంగానే!

వాషింగ్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ కార్యక్రమంలో కాల్పులు కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు కొన్ని గంటల ముందు ఓ మీడియా సంస్థతో వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ చేసిన సరదా వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. అధ్యక్షుడు ట్రంప్ (Donald Trump) చేసే ప్రసంగాన్ని ఉద్దేశిస్తూ.. ఈ రాత్రి కొన్ని తూటాలు పేలనున్నాయంటూ వ్యాఖ్యానించారు. చివరకు నిజంగానే అక్కడ కాల్పులు జరగడంతో ఆమె వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. "ఈ కార్యక్రమానికి ముఖ్య




అతిథిగా రానున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనదైన శైలిలో ప్రసంగిస్తారు. చాలా ఫన్నీగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. సమావేశ మందిరంలో మాటల తూటాలు పేలుతాయి. చూస్తూనే ఉండండి. నేనూ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు. పదునైన రాజకీయ పదజాలంతో ట్రంప్ ప్రసంగం ఉంటుందనే ఉద్దేశంతో ఆమె ఇలా సరదాగా చెప్పారు. కానీ, కొన్ని గంటల్లోనే ఆ ప్రాంగణంలోకి ప్రవేశించిన ఓ సాయుధ దుండగడు కాల్పులు జరిపి హంగామా సృష్టించడం గమనార్హం.

## పాకిస్థాన్‌కు మళ్లీ వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి.. చర్చలపై వీడని సందిగ్ధత

ఇరాన్ అమెరికాల మధ్య రెండో విడత చర్చలపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాల నడుమే ఇరాన్ (Iran) విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మరోసారి పాకిస్థాన్‌కు చేరుకున్నారు. శనివారం అమెరికా ప్రతినిధులు రాకముందే ఆయన ఇస్లామాబాద్ నుంచి ఒమన్‌కు వెళ్లిపోయారు. ఆ వెంటనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ ప్రతినిధులను పాకిస్థాన్‌కు పంపడం లేదంటూ ప్రకటించారు. గతంలో ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికాల మధ్య పరోక్ష చర్చలు జరిగాయి. దీంతో అరాగ్చీ ఒమన్ పర్యటన ప్రాధాన్యం



సంతరించుకుంది. ఇప్పుడు ఆయన మళ్లీ పాకిస్థాన్‌కు చేరుకోవడం గమనార్హం. అయితే, రష్యా పర్యటనకు వెళ్లే ముందు అరాగ్చీ ఇస్లామాబాద్‌కు వెళ్లారని ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది.

## అలకనంద నదిలో హైదరాబాద్ విద్యార్థి గల్లంతు

ఉత్తరాఖండ్‌లో విషాదం చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి అలకనంద నదికి వెళ్లిన ఓ ఎన్ఐటీ విద్యార్థి.. ప్రవాహంలో గల్లంతయ్యాడు. బాధితుడు హైదరాబాద్‌కు చెందిన ఆనంద్ మోహన్‌గా గుర్తించారు. ఎన్ఐటీ ఉత్తరాఖండ్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎన్ఐటీ గ్రౌండ్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు చెప్పారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ముగ్గురు స్నేహితులతో కలిసి ఆనంద్ మోహన్ నదికి వెళ్లారు. ఈ క్రమంలో ఓ ఎత్తైన ప్రదేశం నుంచి నదిలోకి దూకి.. ఆ తర్వాత పైకి రాలేదు. దీంతో భయాందోళనకు గురైన స్నేహితులు.. ఈ విషయాన్ని వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేశారు. స్పందించిన పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, వాటర్‌పోలీస్ సహా ఇతర బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి.

## ప్రతి ఫైల్‌కు పాస్‌వర్డ్: టీసీఎస్ నాసిక్ ప్రధాన నిందితుడి జాగ్రత్తలు

నాసిక్ టీసీఎస్‌లో లైంగిక వేధింపుల కేసు విచారణకు సంబంధించి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన నిందితుడి ఫైల్స్, ఫోన్ దర్యాప్తునకు ప్రధాన ఆటంకంగా మారాయి. ప్రతి దానికి అతడు పాస్‌వర్డ్‌లు పెట్టడంతో వాటిని ఓపెన్ చేయడం సవాల్‌గా మారింది. దీంతో నిందితుడిని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ నాసిక్‌లోని రీజనల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. "డిజిటల్ ఆధారాలను సంపాదించడంలో దర్యాప్తు బృందాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా వరకు ఎలక్ట్రానిక్ పరికరాలకు పలు పాస్‌వర్డ్‌లు ఉన్నాయి. దీంతో వాటిని యాక్సెస్ చేయడానికి ఫోరెన్సిక్ సహాయం కోరాము" అని ఏసీపీ సందీప్ మిట్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని నాసిక్ టీసీఎస్ కార్యాలయంలో లైంగిక వేధింపులు, మతమార్పిడికి ఒత్తిళ్ల కేసులో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధితురాళ్లు పోలీసుల విచారణలో వెల్లడిస్తున్న వివరాలు అక్కడ కొనసాగిన కీచకపర్వాన్ని బట్టబయలు చేస్తున్నాయి. హిందూ మతంతో పాటు, దేవుళ్లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, తమతో అసభ్యకరంగా ప్రవర్తించడం, బురఖా ధరించాలని



ఒత్తిడి చేయడం.. ఇలా నిందితుల నుంచి తమకు అనేక రకాలుగా వేధింపులు ఎదురైనట్లు బాధితురాళ్లు చెబుతున్నారు. గతేడాది వివాహం చేసుకొని టీసీఎస్‌లో చేరిన ఓ బాధితురాలు తన వాంగ్మూలంలో పేర్కొన్న విషయాలు బయటికొచ్చాయి. దీనిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా తీవ్రంగా స్పందించారు. నిందితులను వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు.

## 'ఆ ఏడుగురిపై వేటు వేయండి'.. రాజ్యసభ ఛైర్మన్‌కు 'ఆప్' వినతి

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (AAP)కి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఒకేసారి భాజపాలోకి ఫిరాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ ఎంపీల చర్యలు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. "ఆ ఏడుగురు ఎంపీలు ఆప్ నుంచి రాజ్యసభలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత పార్టీని వీడి భాజపా చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో వారి సభ్యత్వాలను రద్దు చేయాలని రాజ్యసభ ఛైర్మన్‌ను కోరాం. ఇటువంటి




ఫిరాయింపులు ప్రజాతీర్పునకు ద్రోహం చేయడమే కాకుండా.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం" అని సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై తాము రాజ్యాంగ నిపుణులను సంప్రదించామని.. చట్టప్రకారం ఆ ఎంపీలు అనర్హతకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**హర్భజన్ సింగ్ భద్రత తొలగింపు..!**

భాజపాలోకి ఫిరాయించిన ఆప్ ఎంపీల్లో ఒకరైన హర్భజన్ సింగ్‌కు గతంలో కేటాయించిన భద్రతను పంజాబ్ పోలీసులు ఉపసంహరించుకున్నట్లు సమాచారం. 9 10 మంది పోలీసులతో కూడిన సెక్యూరిటీని తొలగించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే జలంధర్‌లోని ఛోటీ బారాదరీ ప్రాంతంలో ఉన్న హర్భజన్ నివాసం వద్ద సీఆర్పీఎఫ్ భద్రతను మోహరించారు. భాజపాలోకి వెళ్లడాన్ని నిరసిస్తూ శనివారం ఆప్ కార్యకర్తలు హర్భజన్ నివాసం వద్ద ఆందోళన చేపట్టారు.

## అణుశక్తిలోనూ భారత్ ముందడుగు: ప్రధాని మోదీ

అణుశక్తి పరిశోధనల్లో భారత్ మరో ముందడుగు వేసిందని ప్రధాని నరేంద్ర మోదీ (PM Narendra Modi) అన్నారు. తమిళనాడులోని కల్పకంలో ఉన్న 500 మెగావాట్ల ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ దేశ దీర్ఘకాలిక అణు వ్యూహంలో ఓ మూలస్తంభమని అభివర్ణించారు. ఈ విషయంలో మన అణు శాస్త్రవేత్తలు విజయాన్ని సాధించి దేశానికి గొప్ప పేరు తీసుకువచ్చారన్నారు. ఈ అణు రియాక్టర్‌ను పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడం విశేషమన్నారు. పౌర అణు కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు మరింత ముందుకు తీసుకువెళ్తున్నారని.. వారి కృషి దేశ నిర్మాణానికి గణనీయమైన తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. ఆదివారం మన్‌కీ బాత్ (Mann Ki Baat) 133వ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ప్రస్తావించారు. మరోవైపు పవన శక్తి ఉత్పత్తిలోనూ భారత్ మరో మైలురాయి దాటిందని మోదీ చెప్పారు. దేశం ముందుకు వెళ్లాలంటే సౌర, పవన శక్తులు చాలా ముఖ్యమన్నారు. పునరుత్పాదక విద్యుత్తు వల్ల భవిష్యత్తు భద్రంగా ఉంటుందన్నారు. పవన శక్తి ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 56గిగావాట్లకుపైగా పవన శక్తిని ఉత్పత్తి చేస్తున్నామన్నారు. గతేడాదితో పోలిస్తే 6 గిగావాట్ల పవన శక్తి అదనంగా ఉత్పత్తి అవుతోందన్నారు.

**ప్రతిఒక్కరు జనగణనలో పాల్గొనాలి..**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న జనాభా లెక్కల ప్రక్రియ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని.. పౌరులందరిదీ అని మోదీ అన్నారు. ప్రతిఒక్కరు ఇందులో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని పూర్తిగా సురక్షితంగా, గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. భారత జనాభా లెక్కల ప్రక్రియ ప్రపంచంలోనే అతిపెద్దదని పేర్కొన్నారు. 2027 జనాభా లెక్కల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నట్లు



వెల్లడించారు. సిబ్బంది మొబైల్ యాప్ ద్వారా ప్రజల వివరాలు నమోదు చేస్తారని చెప్పారు. తమ సమాచారాన్ని స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కూడా ప్రజలకు ఇస్తున్నట్లు వెల్లడించారు.

## తినాలనిపించే మట్టి.. చూడాలనిపించే రాళ్లు!

* **హర్మూజ్ ద్వీపంలో అద్భుతాలు**
* **హర్మూజ్... అనగానే ఉద్రిక్తమైన జలసంధిగా ఇప్పుడు తెలుసు... కానీ అక్కడో భౌగోళిక అద్భుతం దాగుంది. అదే... హర్మూజ్ ద్వీపం!**

పర్షియన్ ఒమన్ సింధు శాఖల మధ్య ఉన్న జలసంధిగా హర్మూజ్ అందరికీ తెలిసిందే. ముఖ్యంగా పర్షియా నుంచి మహా సముద్రాల్లోకి దారితీసే ఏకైక సముద్ర మార్గం ఇది. అందుకే ప్రపంచంలోని కీలక సముద్ర మార్గాల్లో ఒకటిగా, వ్యూహాత్మక ప్రదేశంగానూ పేరొందింది. ఆ మార్గంలోనే ఉన్న హర్మూజ్ ద్వీపాన్ని పర్యాటక స్వర్గమనే చెప్పొచ్చు. కళ్లు చెదిరే అందాలతో పాటు... ఎన్నో వింతలకు నెలవిది. ఉప్పు గుహలు, విచిత్ర ఆకారాల రాతి నిర్మాణాలు, తినే మట్టి... ఇలా చాలా ప్రత్యేకతలు ఇక్కడున్నాయి. ద్వీపం విస్తీర్ణం 42 చదరపు కి.మీ. మాత్రమే. అయితేనేం, చలికాలంలో ఇది పర్యాటకులతో సందడిగా ఉంటుంది. వేల సంవత్సరాలుగా జనావాసంతో ఉన్న ఈ ద్వీపాన్ని మార్కోపోలో, ఇబన్ బటూటా వంటి ప్రసిద్ధ యాత్రికులు సందర్శించేవారట. గోవా, గుజరాత్‌ల నుంచి ఇరాన్‌లోని ఖేష్మ్ దీవికి ప్రయాణించే ఓడలకు విడిది కేంద్రంగా ఈ దీవిని ఉపయోగించేవారట. అందుకే ఈ ద్వీపంలో పోర్చుగీసు కోట గోడల శిథిలాలు కనిపిస్తుంటాయి.

**అక్కడి మట్టి... అలా ప్రత్యేకం!**

అన్నిటినీ మించిన విశేషం...గెలాక్‌గా పిలిచే ఎర్రటి మట్టి. ఐరన్ ఆక్సైడ్‌తో నిండిన ఈ మట్టిని స్థానికులు సీఫుడ్, ఊరగాయలు, రొట్టె... ఇలా అన్ని రకాల వంటకాల్లో సుగంధ ద్రవ్యంగా వాడుతుంటారు. కాస్మొటిక్స్, సెరామిక్స్ తయారీకీ ఉపయోగిస్తారు. రంగుల మట్టితో చేసిన కళాఖండాల్ని ఇక్కడి మ్యూజియంలోనూ ప్రదర్శిస్తారు. నిజానికి ఈ దీవిలో ఎటు చూసినా రంగుల విన్యాసమే. ఎరుపు రంగులో మెరిసే బీచ్ నీలిపచ్చ రంగుల సాగరాన్ని తాకుతూ సూర్యోదయ, సూర్యాస్తమయాల్లో అందమైన వర్ణపటాన్ని తలపిస్తుంది. తీరంలో కనిపించే ఆ ఎర్రటి కాంతిని ఆ దారిలో ప్రయాణించే నావికులు ఓ సంకేతంగా భావించేవారట. అక్కడ దొరికే మట్టి రంగుల్లోనే పర్యాటకులకోసం రెస్టారెంట్లనీ, కెఫెల్నీ నిర్మించడం ఈ దీవిలో మరో విశేషం. అలాగే వివిధ జీవుల్ని పోలి ఉండే చిత్రమైన సహజ శిథిల రాతి నిర్మాణాలు చూపరుల్ని కళ్లు తిప్పుకోనీయవు. ఈ దీవిలో 70కి పైగా ఖనిజాలు ఉన్నాయనీ వాటివల్లే అక్కడి రాళ్లూ మట్టీ విభిన్న వర్ణాల్లో కనువిందు చేస్తున్నాయనేది జియాలజిస్టుల విశ్లేషణ. అందుకే ఈ దీవిని రెయిన్‌బో ఐలాండ్ అనీ పిలుస్తారు. హర్మూజ్ దీవి సుమారు 60 కోట్ల సంవత్సరాల క్రితం సముద్రం లోపలి నుంచి పొరలుపొరలుగా పైకి ఉబికిన ఉప్పు గుమ్మటం...ఓ భౌగోళిక అద్భుతం. అందుకే తెల్లని ఉప్పు కయ్యలూ గుహలూ ఇక్కడ చాలా ఉన్నాయి. రాత్రివేళల్లో రంగుల జీవజాలంతో మెరిసే సముద్రం, విదేశీ వలస పక్షుల విన్యాసాలతో నిండిన హర్మూజ్ దీవిలో ప్రతిదీ అద్భుతమే. ఇక్కడి ఎరుపు రంగు నేలని విశ్వ సంఘటనలు, పౌరాణిక జీవులకీ ముడిపెడుతూ స్థానికులు కథలూ చెబుతుంటారు. అందుకే హర్మూజ్... చమురు రవాణా మార్గం మాత్రమే కాదు, యాత్రికులనీ ఫొటోగ్రాఫర్లనీ భూవిజ్ఞాన శాస్త్రవేత్తల్నీ ఆకర్షించే చిత్రవిచిత్రమైన ప్రదేశం!



# మధుర పరిమళాల మనోహరం!

**ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.**





హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన






కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.

# చెమట పడితే మంచిదేనట!

**వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**



వడదెబ్బ తగలకుండా..!

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.

**రోగనిరోధక శక్తికి!**

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్ కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలోరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.





# ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.



## 'మైసా' కోసం
# రష్మిక భారీ యాక్షన్!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్ర యూనిట్ కేరళలో కీలకమైన 15 రోజుల యాక్షన్ షెడ్యూల్‌ను ప్రారంభించింది. ఈ షెడ్యూల్‌లో రష్మికపై హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేకంగా స్టంట్ అండ్ కంబాట్ బూట్ క్యాంప్‌లో పాల్గొన్నారు. చేతులతో పోరాటం, అధునాతన స్టంట్ టెక్నిక్స్ వంటివి నేర్చుకున్నారు. ఈ శిక్షణ తర్వాతే ఆమె కేరళ షెడ్యూల్‌లో జాయిన్ అయ్యారు. ఈ చిత్రంలో రష్మిక ఒక గోండు తెగకు చెందిన యువతి పాత్రలో కనిపించనున్నారు. శారీరక దృఢత్వంతో పాటు భావోద్వేగాలను కూడా పండించాల్సిన పాత్ర ఇది. భారతీయ సినిమాలో మహిళా ప్రధాన యాక్షన్ చిత్రాలకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసేలా ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు చిత్ర బృందం చెబుతోంది.

## పెళ్లి మోసం ఆరోపణలు
## క్లారిటీ ఇచ్చిన
# అషురెడ్డి



తనపై వచ్చిన ఆరోపణలపై నటి అషురెడ్డి స్పందించారు. తన ప్రమేయం లేకుండా తన గురించి వార్తలు రాసినా, తప్పుడు ప్రచారం చేసినా లీగల్ యాక్షన్ తప్పదంటూ హెచ్చరించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తన కుమారుడిని పెళ్లి చేసుకుంటానని చెప్పి అషు మోసం చేసిందంటూ హైదరాబాద్ షేక్‌పేట్ వాసి యెనుముల సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.9.35 కోట్ల విలువ చేసే నగదు, బంగారం, ఫ్లాట్‌లు, వాహనాలను తన పేరుపై రిజిస్టర్ చేయించుకుందని ఆయన ఆరోపించారు. సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'ది కేరళ స్టోరీ 2' ఓటీటీ రిలీజ్ డేట్‌లో మార్పు..
## వారం ముందే స్ట్రీమింగ్



'ది కేరళ స్టోరీ 2' ఓటీటీ విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. ఈ చిత్రం మే 8 నుంచి తమ ప్లాట్‌ఫామ్‌పై స్ట్రీమింగ్ అవుతుందని ప్రకటించిన 'జీ 5' సంస్థ.. రిలీజ్ డేట్‌ను మార్చింది. మే 1 నుంచే తెలుగు ఆడియోలోనూ అందుబాటులో ఉంటుందని తెలిపింది. 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందిన 'ది కేరళ స్టోరీ 2' కూడా వివాదాల నడుమ థియేటర్లలో విడుదలైన సంగతి తెలిసిందే. ఉల్కా గుప్త, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో కామాఖ్యా నారాయణ్ సింగ్ తెరకెక్కించారు. ఈ సినిమా కథేంటంటే?: స్వతంత్ర భావాలు కలిగిన నేటితరం అమ్మాయిలు సురేఖ (ఉల్కా గుప్త), దివ్య (అదితి), నేహా (ఐశ్వర్య). కేరళకు చెందిన సురేఖ యూపీఎస్సీకి సిద్ధమవుతూ ఉంటుంది. జర్నలిస్ట్ సలీమ్ (సుమిత్ గహ్లోవత్)తో ఏర్పడిన పరిచయం లివింగ్ ఇన్ రిలేషన్‌కు దారితీస్తుంది. దివ్యకు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా రాణించాలని కోరిక. లైక్‌లు, షేర్‌ల కోసం ఆమె చేసే నృత్యాలను తల్లిదండ్రులు ప్రోత్సహించరు. అదే సమయంలో పరిచయమైన రషీద్ (యుక్తమ్) ఆమెను ప్రేమిస్తున్నానని చెబుతూ, జీవితంలో అన్ని విషయాల్లో అండగా ఉంటానంటూ భరోసా ఇస్తాడు. ఇక జావెలెన్ త్రో రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తూ.. జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతుంటుంది నేహా. ప్రేమ పేరుతో ఆమెను తనవైపు తిప్పుకొని, దిల్లీలో ప్రఖ్యాత శిక్షకుడితో ట్రైనింగ్ ఇప్పిస్తానని మాయమాటలు చెబుతాడు రాజు అలియాస్ ఫైజన్. ఇలా ముగ్గురు అమ్మాయిలు తల్లిదండ్రుల మాటలను పెడచెవిన పెట్టి ప్రేమించిన వారితో వెళ్లిన తర్వాత ఏం జరిగింది? రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక వాళ్లు తీసుకున్న నిర్ణయం ఏంటి? అన్నది ఈ సినిమా కథ.

# సినిమా



# అందుకే మమితా బైజు
## నటించదనుకున్నా: 'కర' దర్శకుడు

'పోర్ తొళిల్'తో ప్రేక్షకులను థ్రిల్ చేసిన దర్శకుడు విఘ్నేశ్ రాజా. ధనుష్ హీరోగా ఆయన తెరకెక్కించిన సినిమా 'కర'. ఈ నెల 30న తెలుగులోనూ విడుదల కానుంది. ఈ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో హీరోయిన్ ఎంపిక గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ''కర'లో ఫిమేల్ లీడ్‌గా తొలుత చైత్ర జె. ఆచార్‌ను ఎంపిక చేశాం. లుక్‌టెస్ట్ కూడా నిర్వహించాం. కానీ, శశికుమార్ 'మై లార్డ్' చిత్రంలోనూ అలాంటి లుక్‌తోనే నటించానని చైత్ర చెప్పారు. 'కర' కన్నా ముందే ఆ మూవీ రిలీజ్ ప్లాన్ చేశారు. రెండు సినిమాల్లోని హీరోయిన్ గెటప్పు సేమ్ అనుకుంటారన్న ఉద్దేశంతో.. తర్వాత మమితా బైజును సంప్రదించా. 'ఆమె ఇప్పటి వరకూ అన్నీ హుషారైన రోల్స్ ప్లే చేసింది. మన సినిమాలోని పాత్ర అందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. నటించదేమో' అని కథ చెప్పిన తర్వాత అనుకున్నా. కానీ, ఆమె నటిస్తానని చెప్పడంతో సర్‌ప్రైజ్ అయ్యా'' అని దర్శకుడు పేర్కొన్నారు. 'సప్త సాగరాలు దాటి: సైడ్ బి', '3 బీహెచ్‌కే'లాంటి సినిమాల్లో కీలక పాత్రలు పోషించిన నటి చైత్ర. 'ప్రేమలు', 'డ్యూడ్' చిత్రాలతో మెప్పించిన హీరోయిన్ మమిత.

# చరణ్-బుచ్చిబాబు
## తుపానుకు ముందు ప్రశాంతత!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రాబోతున్న 'పెద్ది' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి దర్శకుడు బుచ్చిబాబు సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. రామ్ చరణ్‌తో కలిసి ఉన్న కొన్ని ఫోటోలను ఆయన పంచుకున్నారు. ఈ ఫోటోలలో రామ్ చరణ్, బుచ్చిబాబు ఎంతో ఉత్సాహంగా, నవ్వుతూ కనిపించారు. ఈ ఫోటోలకు "తుపానుకు ముందు ప్రశాంతత" అని క్యాప్షన్ జోడించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అంతేకాకుండా, "నాకు ఇష్టమైన పోజులో నా ఫేవరెట్ సర్.. లవ్ యూ సర్" అంటూ రామ్ చరణ్‌పై బుచ్చిబాబు తన అభిమానాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం 'పెద్ది' షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ సినిమాను జూన్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్'తో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన రామ్ చరణ్, తొలి సినిమా 'ఉప్పెన'తోనే బ్లాక్‌బస్టర్ అందుకున్న బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలోనూ, అభిమానుల్లోనూ అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగా.. సినిమా అప్‌డేట్స్ కోసం మెగా అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.



## దిల్ రాజు రివీల్ చేసిన
# 'గాయపడ్డ సింహం' విశేషాలు



నటుడిగా, దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తరుణ్ భాస్కర్, హీరోగా నటించిన తాజా చిత్రం 'గాయపడ్డ సింహం'. ఈ సినిమా మే 1న థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో నిన్న హైదరాబాద్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ నిర్మాత దిల్ రాజు, హీరో దుల్కర్ సల్మాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ సినిమాపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దిల్ రాజు మాట్లాడుతూ... "పవన్ సాదినేని ఈ సినిమా కాన్సెప్ట్ చెప్పగానే చాలా బాగా నచ్చింది. వెంటనే ఈ సినిమా కొనేశాను. కానీ, సినిమా చూసేవరకు ఒక టెన్షన్ ఉండేది. ఓవర్ కాన్ఫిడెన్స్‌తో కొనేశామా అనిపించింది. నాలుగు రోజుల క్రితమే సినిమా చూశాను. చూస్తున్నంత సేపు నవ్వుతూనే ఉన్నాను. ఇది చిన్న కాన్సెప్ట్ బేస్డ్ సినిమా. 35 ఏళ్ల క్రితం వచ్చిన జేడీ చక్రవర్తి 'మనీ' లాంటిది. ఇటీవల వచ్చిన 'జాతిరత్నాలు' కూడా ఒక చిన్న ఐడియాతో వచ్చి పెద్ద విజయం సాధించింది. ఈ సినిమా కూడా అదే కోవలోకి వస్తుంది" అని అన్నారు. సినిమాలోని కీలక అంశాలను పంచుకుంటూ... "ఈ సినిమాలో ఒకరు కాదు, ఇద్దరు హీరోలు ఉన్నారు. తరుణ్ భాస్కర్‌తో పాటు ట్రంప్ కూడా హీరోనే. ఆ కాన్సెప్ట్ చాలా బాగా రాసుకున్నారు. సెకండాఫ్‌లో ప్రభాస్, మహేశ్ బాబు, యష్, అర్జున్ రెడ్డి వంటి స్టార్ హీరోల రిఫరెన్సులతో ఐదు ఎపిసోడ్స్ డిజైన్ చేశారు. అవి థియేటర్‌లో ప్రేక్షకులను విపరీతంగా ఎంటర్‌టైన్ చేస్తాయి. ఆ ఎపిసోడ్స్ కనుక వర్కవుట్ అయితే, ఇది మరో 'జాతిరత్నాలు' అవడం ఖాయం. శ్రీవిష్ణు క్యామియో, జేడీ చక్రవర్తి నటన సినిమాకు అదనపు బలం" అని దిల్ రాజు వివరించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.